




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 103 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కావలి, నెల్లూరుజిల్లా సోమవారం 23 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 103 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAVALI, NELLORE DIST, MON 23 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : ,SPSR Nellore, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa, Hyderabad, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీసేందుకు

# జగన్ కుట్ర

## మంత్రి నిమ్మల రామానాయుడు

**పెన్ పవర్ డెస్క్:**తిరుమల శ్రీవారి ప్రతిష్టను భంగపరిచేలా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుట్రలు పన్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంతో పాటు యలమంచిలి మండలం కొంతేరు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన జగన్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని రసాయనాల మిశ్రమంతో అపవిత్రం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని మంత్రి విమర్శించారు. లడ్డూ తయారీలో నెయ్యికి బదులు రసాయనాలు కలిశాయని సీబీఐ తన ఛార్జిషీట్‌లో పేర్కొన్నా, జగన్ ఏ మొహం పెట్టుకుని మాట్లాడు తున్నారని ప్రశ్నించారు. పవిత్రమైన శ్రీవారి పటాలను శాసనమండలిలో ప్లకార్డులుగా ప్రదర్శించడం దారుణమని, ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని మండిపడ్డారు.

**అభివృద్ధి పనులకు శ్రీకారం..**

పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. పాలకొల్లులో రూ. 4.43 కోట్ల విలువైన పనులకు

- మిగతా2లో

# టెక్నాలజీ పెరిగినా మీ 'హ్యూమన్ టచ్'కు సాటిలేదు

## గ్రామీణ డాక్ సేవక్‌లపై సీఎం చంద్రబాబు ప్రశంసలు

- గ్రామీణ డాక్ సేవకుల సేవలు అమూల్యం అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని సమర్థతపై ప్రశంసలు
- ఏపీలోని 17,000 మంది డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి
- రాష్ట్ర ప్రభుత్వ సేవలను కూడా డాక్ సేవకుల ద్వారా అందిస్తామని హామీ
- వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో పోస్టల్ ఉద్యోగులదే కీలక పాత్ర అని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**టెక్నాలజీ ఎంత అభివృద్ధి సాధించినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి అందుబాటులోకి వచ్చినా, గ్రామీణ ప్రాంతాల్లో మానవతా స్పర్శతో సేవలు అందించే గ్రామీణ డాక్ సేవకులకు ప్రత్యామ్నాయం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో వారి పాత్ర అత్యంత కీలకమని, వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం నాడు గుంటూరులో గ్రామీణ డాక్ సేవక్‌లతో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, పాత రోజులను గుర్తుచేసుకున్నారు. ఒకప్పుడు ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, ఇతర సమాచారం కోసం ప్రతి ఒక్కరూ పోస్ట్‌మ్యాన్‌పైనే ఆధారపడేవారని, బ్యాంకులు లేని రోజుల్లో ఆర్థిక లావాదేవీలకు కూడా ఇండియా పోస్టే కీలక మాధ్యమంగా ఉండేదని తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కూడా సమరయోధుల మధ్య సమాచారాన్ని చేరవేసి పరోక్షంగా కీలక పాత్ర పోషించిన వారి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

**కేంద్ర మంత్రులపై ప్రశంసల వర్షం**

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించిన ఉన్నత విద్యావంతుడని, రాజవంశంలో పుట్టినా అత్యంత పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని కొనియాడారు. సింధియా నాయనమ్మ, గ్వాలియర్ రాజమాత విజయరాజే సింధియాతో తనకు మంచి అనుబంధం ఉందని, ఆమె ఎన్టీ రామారావుగారికి అత్యంత సన్నిహితురాలని గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా, సింధియా తండ్రి మాధవరావు సింధియాతో కూడా కలిసి పనిచేశానని, ఆయన నిరాడంబరత, నిజాయతీ గొప్పవని అన్నారు. సింధియా పూర్వీకుల గ్రామమైన 'సింధియా' విశాఖపట్నం గాజువాక సమీపంలో ఉండటం ఆనందంగా ఉందని, వారి కుటుంబానికి ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న ఈ అనుబంధం గొప్పదని పేర్కొన్నారు. మరో కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానిని ప్రశంసిస్తూ, ఒక వైద్యుడిగా, ఐటీ నిపుణుడిగా అమెరికాలో అపారమైన సంపద సృష్టించి, ఇప్పుడు పార్లమెంటులో అత్యంత సంపన్న ఎంపీగా ప్రజాసేవకు

- మిగతా2లో



## జగన్ హిందూ వ్యతిరేకి..

### అసెంబ్లీ చర్చకు రావాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సవాల

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నిప్పులు చెరిగా రు. జగన్ ఒక 'హిందూ వ్యతిరేకి' అని, ఆయ నకు హిందూ

- మిగతా2లో



## ఏపీలో లడ్డూ సమస్య తప్ప ఇంకేమీ లేవా?

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో లడ్డూ సమస్య తప్ప ఇంకేమీ లేవా అంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. జగన్ పై, వైసీపీ నేతలపై బురద చల్లడమే చంద్రబాబు లక్ష్యమా అని అన్నారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ చెప్పినా కూటమి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసలు రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా అని

- మిగతా2లో

## ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ సస్పెన్షన్ పొడిగింపు...

### పదవీ విరమణ వరకూ వేటు!



- ఐపీఎస్ సునీల్ కుమార్‌పై కొనసాగనున్న సస్పెన్షన్
- ప్రభుత్వం కీలక ఉత్తర్వులు
- రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ప్రధాన ఆరోపణలు
- సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వాదన

- మిగతా2లో

## రాబోయే 24 గంటల్లో అల్పపీడనం

### ఈ జిల్లాల్లో దంచికొడుతున్న భారీ వర్షం

**పెన్ పవర్ డెస్క్:**వాతావరణ శాఖ అలర్ట్ ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అల్పపీడ ౕన ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఆదివారం మధ్యాహ్నం తర్వాత వర్షాలు కురుస్తున్నాయి. ఏపీలోని అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడటంతో

- మిగతా2లో



## మన టెక్నాలజీ చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయాయి

### 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

- ఏఐ సదస్సు ద్వారా అద్భుతమైన సామర్థ్యాలను ప్రపంచానికి చూపించామన్న మోదీ
- జంతువుల చికిత్సకు, పురాతన గ్రంథాల సంరక్షణ కోసం ఏఐ వినియోగం చూసి ఆశ్చర్యపోయారన్న మోదీ
- సైబర్ నేరాల పట్ల హెచ్చరిక జారీ చేసిన నరేంద్ర మోదీ
- 10 నెలల చిన్నారి అవయవదానానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులకు ప్రశంసలు

**పెన్ పవర్ డెస్క్:**న్యూఢిల్లీలోని భారత్ మండ ౕపంలో ఇటీవల ముగిసిన 'ఏఐ ఇంపాక్ట్' సదస్సుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. దీని ద్వారా కృత్రిమ మేధ రంగంలో భారతదేశ అద్భుతమైన సామర్థ్యాలను ప్రపంచానికి చూపించామని అన్నారు. ఆదివారం 131వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఈ సదస్సు ప్రపంచ దేశాలను ఆకర్షించిందని అన్నారు. ఈ సదస్సులో ముఖ్యంగా మన రెండు ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయని తెలిపారు. జంతువుల చికిత్సకు వాటిని ట్రాక్ చేయడానికి



- మిగతా2లో

## దేశంలోనే వేగవంతమైన మెట్రో... మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ

- గంటకు 120 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించనున్న మెట్రో
- నమో భారత్ రైలు సేవలను కూడా ప్రారంభించిన ప్రధాని మోదీ
- పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన ఢిల్లీ-మీరట్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్

**పెన్ పవర్ డెస్క్:** దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో సేవలు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రారంభమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఈ సర్వీసులను లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ మెట్రో గంటకు గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ మీరట్ మెట్రో దేశంలోనే అతి వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలిచింది. మీరట్ మెట్రో సేవలు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆధునిక రవాణా వ్యవస్థతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు




- మిగతా2లో

## మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ

### అగ్రనేతలు లొంగుబాటు

- లొంగిపోయిన మావోయిస్టు నాయకులు దేవ్ జీ, మల్లారెడ్డి
- తెలంగాణ ఎస్ఐబీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు
- వీరితో పాటు 16 మంది లొంగుబాటు

- మిగతా2లో

**పెన్ పవర్ డెస్క్:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'లో కీలక పరిణామం చోటు చేసుకున్నది. మావోయిస్టు కీలక నేతలు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి భద్రతా బలగాలకు సరెండర్ అయ్యారు. దేవ్ జీ మావోయిస్టు పార్టీ జనరల్






## కుంగుబాటుకు వ్యాయామ కళ్లెం!

కుంగుబాటు (డిప్రెషన్), వ్యాయామం ఒకదాన్ని మరోటి ప్రోత్సహిస్తుంటాయి. కుంగుబాటుతో వ్యాయామం మీద ఆసక్తి తగ్గుతుంది. తగినంత శారీరక శ్రమ లేకపోతే కుంగుబాటు మరింత తీవ్రమవుతుంది. అందుకే డిప్రెషన్‌తో బాధపడేవారికి వ్యాయామం చేయాలని నిపుణులు సూచిస్తుంటారు. దీంతో, ముఖ్యంగా బరువులెత్తే వ్యాయామాలతో మందులు, చికిత్సలతో సమానమైన ఫలితాలు కనిపిస్తున్నట్టు తాజాగా తేలింది. యూనివర్సిటీ ఆఫ్ లాంకషైర్ పరిశోధకులు 70కి పైగా ప్రయోగ పరీక్షలను సమీక్షించి ఈ విషయాన్ని గుర్తించారు. మానసిక స్థితి (మూడ్) మీద శారీరక శ్రమ గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నట్టు గత పరిశోధనలు చెబుతున్న విషయాన్ని ఇది మరింత బలపరచింది. వ్యాయామం, శారీరక శ్రమలు కుంగుబాటుతో ముడిపడిన వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్)ను తగ్గిస్తాయి. జీవ గడియారాన్ని తిరిగి సరిచేసి నిద్ర బాగా పట్టేలా చేస్తాయి. నాడీ కణాల వృద్ధికి తోడ్పడే బ్రెయిన్ డిరైవ్డ్ న్యూరోట్రోఫిక్ ఫ్యాక్టర్ విడుదలనూ ప్రేరేపిస్తాయి. ఈ ఫ్యాక్టర్ మూడ్ నియంత్రణకు దోహదం చేయటం గమనార్హం. అందువల్ల కుంగుబాటు బాధితులు వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేయొద్దని పరిశోధకులు సూచిస్తున్నారు. చికిత్స ప్రణాళికల్లో దీన్ని విధిగా చేర్చాలని చెబుతున్నారు. ఈ సమీక్ష కోసం పరిగణనలోకి తీసుకున్న అధ్యయనాలు కొన్ని పాఠాలనూ నేర్పుతున్నాయి.

**1. ఒక చికిత్స సరిపోదు**

కుంగుబాటు మనిషిని చాలా తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. జీవితంలో తృప్తిని ఘోరంగా దెబ్బతీస్తుంది. ఇలాంటి తీవ్ర సమస్యకు ఒక చికిత్స సరిపోదు. సైకోథెరపీ, యాంటీడిప్రెసెంట్ మందులకు వ్యాయామాన్ని జోడిస్తే మంచి ఫలితాలు కనిపిస్తున్నట్టు ఒక అధ్యయనంలో తేలింది. అందుకే మందులు వేసుకుంటున్నా, వేసుకోకపోతున్నా సైకాలజిస్టును సంప్రదించటం, వ్యాయామం చేయటం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

**2. ఎంత శ్రమకు అంత ఫలితం**

వ్యాయామం చేస్తేనే సరిపోదు, ఎంత తీవ్రంగా చేస్తున్నామన్నదీ ముఖ్యమే. మామూలు వ్యాయామం కన్నా తీవ్రమైన వ్యాయామంతో ఎక్కువ ఫలితాలు కనిపిస్తున్నాయి. శరీరాన్ని 10 నుంచి 20 నిమిషాలు ఒకింత ఎక్కువ శ్రమకు గురిచేసినా చాలు. తీవ్రమైన వ్యాయామంటే మరీ కష్టమని అనుకోవాల్సిన పనిలేదు. పక్కవారితో మాట్లాడటం కష్టంగా అనిపిస్తే తీవ్రంగా చేస్తున్నట్టే లెక్క. ఇది ఆయా వ్యక్తుల శరీర సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది.

**3. వ్యాయామం ఏదైనా**

నడక, నెమ్మదిగా పరుగెత్తటం, యోగా, బరువులు ఎత్తటం.. ఇలా ఏ రకం వ్యాయామమైనా కుంగుబాటు చికిత్సకు తోడ్పడుతుంది. రెండు, మూడు వారాలుగా కుంగుబాటుతో బాధపడేవారికి డ్యాన్స్ చాలా మేలు చేస్తున్నట్టు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కానీ వీటిల్లో కొద్దిమందిని.. అదీ యువతులను పరిగణనలోకి తీసుకోవటం వల్ల అందరికీ వర్తింపజేయటం తగదని పరిశోధకులు భావిస్తున్నారు. బరువులెత్తటం, సైకిల్ తొక్కటం ఆడవారికి బాగా ఉపయోగపడుతుంటే.. యోగా, థాయ్ చీ మగవారికి మరింత మేలు చేస్తున్నట్టు కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. వృద్ధులకు యోగాతో, చిన్నవయసువారికి బరువులెత్తటంతో ప్రయోజనం కనిపిస్తోంది. యోగా, బరువులు ఎత్తటాన్ని మానకుండా కొనసాగిస్తున్నట్టూ బయటపడింది.

**4. తోడుగా చేస్తే**

ఐకమత్యం బలమనే సూత్రం వ్యాయామానికీ వర్తిస్తుంది. ఒంటరిగా కన్నా నలుగురితో కలిసి వ్యాయామాలు చేస్తే కుంగుబాటు లక్షణాలు మరింతగా తగ్గుతుండటం గమనార్హం. కుంగుబాటులో ఒంటరిగా ఉండిపోవటం పెద్ద లక్షణం. నలుగురితో కలిసి వ్యాయామం చేస్తే ఒంటరితనం దూరమవుతుంది. ఇతరుల కన్నా మరింత కఠినంగా చేయాలనే కోరికా కలుగుతుంది. కాబట్టి వీలుంటే జిమ్‌లో చేరి శిక్షకుల సమక్షంలో లేదా బృందంగా వ్యాయామం చేయటం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు.

**5. నైపుణ్యం సాధిస్తే**

వ్యాయామాల్లో నైపుణ్యం సాధించటమూ దిగులు, నిరాశ ఎక్కువగా తగ్గటానికి తోడ్పడుతుంది. ఒకింత ఎక్కువ బరువు ఎత్తటం.. కాస్త ఎక్కువ దూరం, ఎక్కువసేపు పరుగెత్తటం కూడా నైపుణ్యం కిందికే వస్తాయి. కుంగుబాటు ఎప్పుడూ గొప్ప పనులు చేయలేవని మనిషిని వెనక్కి లాగుతుంటుంది. దీంతో చాలామంది అక్కడే ఆగిపోతుంటారు. వ్యాయామం దాన్ని అబద్ధమని నిరూపిస్తుంది. మారటం సాధ్యమేనని, కొత్త అలవాట్లు నేర్చుకోవచ్చని, మెరుగ్గా పనులు సాధించొచ్చని నేర్పిస్తుంది. ఇది నిజంగా ఒక శక్తిమంతమైన ఔషధమే. పరుగు, బరువులెత్తటం శరీరానికి పరీక్ష పెట్టి, పురోగతి సాధించేలా చేస్తాయి. యోగా, థాయ్ చీ వంటివి ఏకాగ్రత, జాగరూకత ద్వారా నైపుణ్యం పెంపొందిస్తాయి.

**6. ఫలితాలు నెమ్మదిగా**

వ్యాయామ ఫలితం కనిపించటానికి కొంత సమయం పడుతుంది. కౌన్సెలింగ్, యాంటీడిప్రెసెంట్ మందుల విషయంలో డాక్టర్లు ఎవరికి ఏది పడుతుందో, ఎంత మోతాదు సరిపోతుందో తెలుసుకోవటానికి సమయం పడుతుంది. మరోవైపు వ్యాయామానికి శారీరక, ఆర్థిక, సామాజిక, మానసిక పరిమితులు అడ్డుతగులుతుంటాయి. ఎవరికేది నప్పుతుందో, ఆనందంగా చేయగలిగిన వ్యాయామాలేంటో గుర్తించటానికి కాస్త సమయం అవసరం. అప్పుడే మధ్యలో మానెయ్యకుండా ఉండటం సాధ్యమవుతుంది. క్రమం తప్పకుండా చేస్తుంటే నెమ్మదిగా ఫలితాలు కనిపించటం మొదలవుతుంది.

# జగన్ హిందూ వ్యతిరేకి..

- మొదటి పేజి తరువాయి

సంప్రదా యాల మీద గౌరవం లేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం అమరావతిలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. జగన్ తీరును, వైసీపీ నేతల వైఖరిని ఎండగట్టారు. శాసనమండలిలో వైసీపీ నేతలు ప్రవర్తించిన తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలిలోకి శ్రీ వెంకటేశ్వర స్వామి ఫొటోను తీసుకొచ్చే సమయంలో వైసీపీ నేతలు చెప్పులు వేసుకుని ఉండటం ఘోరమైన అపరాధమని ఆయన పేర్కొన్నారు. కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే పవిత్రమైన భగవంతుడిని సభలోకి తెచ్చారని, ఆ సమయంలో జరిగిన పొరపాటు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తున్నా వైసీపీ నేతలు బుకాయించడం సిగ్గుచేటని మండిపడ్డారు.

**తిరుమల పవిత్రతపై విమర్శలు..**

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై స్పందిస్తూ.. గత ప్రభుత్వ హయాంలో జంతు కొవ్వుతో పాటు హానికర రసాయనాలు కలిశాయని నివేదికలే చెబుతున్నాయని మంత్రి గుర్తుచేశారు. జగన్ తన హయాంలో ఏనాడూ పవిత్ర సంప్రదాయాలను గౌరవించలేదని, శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే సమయంలో తన సతీమణితో కలిసి వెళ్లకపోవడమే దానికి నిదర్శనమని విమర్శించారు. అలాగే తిరుమలలో అన్యమతస్థులు ఇచ్చే డిక్లరేషన్‌పై సంతకం చేయడానికి జగన్ నిరాకరించడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు.

**అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?**

జగన్ అహంకారం చూసే భగవంతుడు గతంలో ఉన్న 151 సీట్ల నుండి కేవలం 11 సీట్లకు పరిమితం చేశారని మంత్రి ఎద్దేవా చేశారు. టీటీడీ నిధులను దారి మళ్లించారని, భక్తి లేని వ్యక్తులకు పదవులు కట్టబెట్టారని ఆరోపించారు. అనుభవం ఉన్న బొత్స సత్యనారాయణ వంటి వారు కూడా జగన్‌ను సరిదిద్దాల్సింది పోయి, ఆయన తప్పులను సమర్థించడం దారుణమన్నారు. ప్రజాధనాన్ని జీతంగా తీసుకుంటున్న జగన్, దమ్ముంటే అసెంబ్లీకి రావాలని మంత్రి సవాల్ విసురుతూ.. 'నువ్వు అసెంబ్లీకి రా.. అక్కడ బహిరంగ చర్చకు మేము సిద్ధం' అని పిలుపునిచ్చారు.

## ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ సస్పెన్షన్ పొడిగింపు...

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీనియర్ ఐపీఎస్ అధికారి, సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ వేటును మరోసారి పొడిగించింది. ఆయనపై నమోదైన క్రిమినల్ కేసుల విచారణ ముగిసే వరకు లేదా ఆయన పదవీ విరమణ చేసే తేదీ వరకు (ఏది ముందైతే అది) సస్పెన్షన్ కొనసాగుతుందని స్పష్టం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1993 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సునీల్ కుమార్ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఐడీ అడిషనల్ డీజీగా, ఆ తర్వాత సీఐడీ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో, అప్పటి నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారనే ఆరోపణలపై గుంటూరు జిల్లా నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆయనపై క్రిమినల్ కేసు (క్రైమ్ నెం. 187/2024) నమోదైంది. ప్రస్తుతం ఈ కేసు ఏసీబీ కోర్టులో విచారణ దశలో ఉంది.
ఈ కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో సునీల్ కుమార్‌ను తిరిగి సర్వీసులోకి తీసుకుంటే సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని, దర్యాప్తు పారదర్శకంగా సాగేందుకు సస్పెన్షన్ పొడిగింపు తప్పనిసరి అని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. వీటితో పాటు, ప్రభుత్వ అనుమతి లేకుండా 2020 నుంచి 2024 మధ్య పలుమార్లు విదేశాలకు వెళ్లడం, అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగం వంటి ఆరోపణలపై కూడా ఆయన ఏసీబీ విచారణను
ఎదుర్కొంటున్నారు.ఆల్ ఇండియా సర్వీసెస్ (డిసిప్లిన్ & అప్పీల్) రూల్స్, 1969లోని రూల్ 3(3) ప్రకారం ఈ పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సునీల్ కుమార్ పదవీ విరమణ తేదీ 2026 జూన్ 30 కావడంతో, అప్పటివరకు కేసుల విచారణ పూర్తికాకపోతే ఆయన సర్వీసులో చేరకుండానే రిటైర్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## మన టెక్నాలజీ చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయాయి

- మొదటి పేజి తరువాయి

'ఏఐ'ని ఉపయోగించడం, భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి ఏఐను ఉపయోగించడం చూసి ప్రపంచ నేతలు ప్రశంసించారని అన్నారు. నాయకులు, పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, స్టార్టప్ రంగాలకు చెందిన వారు ఈ సదస్సుకు హాజరయ్యారని తెలిపారు.
కృత్రిమ మేధ, అంతరిక్ష పరిశోధన, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ సహా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన యువత ఆవిష్కరణలతో దేశ కీర్తిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లే శక్తిని కలిగి ఉందని అన్నారు. ఈ సదస్సు ద్వారా మన యువత ప్రతిభను ప్రపంచానికి చూపించగలిగామని అన్నారు.

**సైబర్ నేరాలపై హెచ్చరిక**

సైబర్ నేరాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.కాగా, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్ అవయవదానానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులను ప్రధాని మోదీ ప్రశంసించారు. బిడ్డను కోల్పోయిన బాధలోనూ వారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. వారి నిర్ణయం నలుగురికి జీవనదాతగా మారిందని పేర్కొన్నారు.

## టెక్నాలజీ పెరిగినా మీ 'హ్యూమన్ టచ్'కు సాటిలేదు

- మొదటి పేజి తరువాయి

ముందుకు రావడం స్ఫూర్తిదాయకమన్నారు. వీరిద్దరి వంటి సమర్థవంతమైన నాయకులు కేంద్రంలో ఉండటం దేశానికి గర్వకారణమని చంద్రబాబు అభివర్ణించారు.

**డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లు.. ఏపీని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టండి**

భవిష్యత్తులో గ్రామీణ డాక్ సేవకుల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు నొక్కిచెప్పారు. వారి పనిభారాన్ని తగ్గించి, ఉత్పాదకతను పెంచేందుకు వీలుగా రాష్ట్రంలోని 17,000 మంది గ్రామీణ డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లను అందించాలని కేంద్ర మంత్రి సింధియాను కోరారు. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఒక 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్'గా పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల కాలుష్యరహిత ప్రయాణంతో పాటు, శ్రమ తగ్గి గ్రామీణ ప్రాంతాల్లో మరింత వేగంగా సేవలు అందించగలరని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సేవలను కూడా గ్రామీణ డాక్ సేవకుల ద్వారా ప్రజలకు చేరవేస్తామని, ఇందుకు అవసరమైన సమన్వయం చేసుకుంటామని హామీ ఇచ్చారు.

**డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు**

రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉండటంతో అభివృద్ధి సూపర్ స్పీడ్‌తో ముందుకు సాగుతోందని చంద్రబాబు తెలిపారు. 20 నెలల సుపరిపాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలికామని అన్నారు. ఒకప్పుడు స్మశానం, ఎడారి అన్న అమరావతిని దేవతల రాజధానిగా, ప్రపంచం మెచ్చే ప్రజా రాజధానిగా తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడి, లాభాల బాట పట్టించామని, ఈ నెలలోనే రూ.54 కోట్ల లాభం వచ్చిందని వెల్లడించారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నెంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని, ఈ 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో గ్రామీణ డాక్ సేవకులే వెన్నెముకగా నిలుస్తారని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత వారిపై ఉందని సూచించారు.

## దేశంలోనే వేగవంతమైన మెట్రో... మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ

- మొదటి పేజి తరువాయి

తగ్గి ప్రజలకు సౌకర్యం కలుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నమో భారత్ రైలు సేవలను కూడా ప్రధాని ప్రారంభించారు. ఢిల్లీ–మీరట్ మధ్య రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టీఎస్) కారిడార్‌పైనే మీరట్ మెట్రో కూడా నడవడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. దేశంలో ఒకే మౌలిక వసతులపై రెండు వేర్వేరు రైలు సేవలు నడవడం ఇదే తొలిసారి. నమో భారత్ రైలు సాధారణంగా గంటకు 160 కి.మీ., గరిష్ఠంగా 180 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని అధికారులు తెలిపా రు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా రూ.12,390 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. 82 కిలోమీటర్ల ఢిల్లీ–మీరట్ నమో భారత్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభించారు. దీంతో ఢిల్లీ, మీరట్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

## శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీసేందుకు జగన్ కుట్ర

- మొదటి పేజి తరువాయి

శంకుస్థాపన చేశారు. కొంతేరు గ్రామంలో రూ. 58 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వం దివ్యాంగుల పట్ల కనికరం లేకుండా వ్యవహరించిందని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులందరికీ నిష్పక్షపాతంగా పింఛన్లు అందిస్తోందని నిమ్మల పేర్కొన్నారు. రాజధాని నిర్మాణంతో రాష్ట్ర యువతకు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న తమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

## ఏపీలో లడ్డూ సమస్య తప్ప ఇంకేమీ లేవా?

- మొదటి పేజి తరువాయి

ప్రశ్నించారు. పోలీసులను రాజకీయ కక్షల కోసం వాడుకుంటున్నారని వ్యాఖ్యానించారు. లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షలకు వాడుకుంటున్నారని అన్నారు. తన ఇల్లు, ఆఫీస్ పై దాడి చేశారని, 5 గంటల నుండి 12 గంటలు దాడి జరుగుతూనే ఉందన్నారు. పోలీసులే ప్రేక్షక పాత్ర పోషించారని ఆరోపించారు. జిల్లా ఎస్పీ కనీసం పట్టించుకోలేదని, రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు, వైవిధ్యాలు ఉంటాయని చెప్పారు. పోలీసులను ఏవిధంగా ఉపయోగిస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలు ఆలోచించమని కోరుతున్నానని అన్నారు.

## మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ

- మొదటి పేజి తరువాయి

సెక్రటరీగా ఉండగా, రాజిరెడ్డి పొలిట్ బ్యూరో మెంబర్‌గా ఉన్నారు. రెండు రోజుల్లో వారిని మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు.
వీరితో పాటు మరో 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీ అలియాస్ తిరుపతి తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాకు చెందినవాడు. వీరంతా తెలంగాణ ఎస్ఐబీ ఎదుట సరెండర్ అయ్యారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత సెక్రటరీగా దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి మావోయిస్టు పార్టీకి సారథ్యం వహిస్తున్నారు.

## రాబోయే 24 గంటల్లో అల్పపీడనం

- మొదటి పేజి తరువాయి

లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అటు తెలంగాణలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోనూ భారీ వర్షం కురిసింది. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఆకాశం మేఘావృతమై చెదురుమదురు వానలు పడుతున్నట్లు సమాచారం అందుతోంది.
అల్పపీడన ద్రోణి కారణంగా రాబోయే 24 గంటల్లో మరిన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ (×వీణ) ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా కోస్తాంధ్ర, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని, రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ అకాల వర్షాల వల్ల కోతకు సిద్ధంగా ఉన్న పంటలు దెబ్బతినే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బీజేపీకి కొత్త అర్థం చెప్పిన షర్మిల... చంద్రబాబు, జగన్ పై తీవ్ర విమర్శలు

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరూ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రచారకర్తలుగా, బీజేపీ ఎదుట బానిసలుగా మారారని, స్వప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే తోలుబొమ్మలని ఆమె తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబుది బీజేపీతో అధికారిక పొత్తు అయితే, జగన్‌ది అక్రమ పొత్తు అంటూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు–జగన్–పవన్ అని, వీరంతా మోదీ కోసం పనిచేస్తున్నారని షర్మిల ఆరోపించారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "ఏఐ సదస్సు వేదికగా ప్రధాని మోదీ ఒక చైనా రోబో బొమ్మను ప్రదర్శించి 70 దేశాల ముందు దేశ ప్రతిష్ఠను దిగజార్చారు. భారతీయ ప్రతిభను తొక్కిపెట్టి చైనా ఉత్పత్తులను చూపించి దేశానికి అవమానం తలపెట్టినప్పుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడి నోళ్లు ఎందుకు పెగల్లేదు? అప్పుడు వారికి సిగ్గుగా అనిపించలేదా? కాంగ్రెస్ నిరసనలు తెలిపినప్పుడు మాత్రం వారి నోర్లు పెగిలాయి" అని వ్యాఖ్యానించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, బాధ్యత గురించి బాబు, ఐక్యత గురించి జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ దేశం కోసం పోరాడుతుంటే మద్దతివ్వాల్సింది పోయి, అధికార పక్షానికి వంత పాడటం సిగ్గుచేటన్నారు. "ట్రంప్ పర్యటన సందర్భంగా అమెరికా ప్రయోజనాల కోసం సున్నా సుంకాలకు ఒప్పుకొని భారత రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు. ఇది రైతాంగానికి మరణశాసనం లాంటి బ్లాక్ డీల్ అని, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని చెబుతూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిరసన తెలిపింది. ఈ వాస్తవాన్ని చంద్రబాబు, జగన్ అర్థం చేసుకోకపోవడం వారి అవివేకం" అని షర్మిల పేర్కొన్నారు.

## పలు కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే డా.పాశిం సునీల్ కుమార్





గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,22:
చిల్లకూరు మండలం పరిధిలోని తూర్పు కనుపూరు గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ దేవస్థానం వద్ద చదలవాడ హరిబాబు నిర్వహించిన పొంగల్లు కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని, గ్రామ ప్రజలతో ముచ్చటించారు. గ్రామాభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు.అలాగే వాకాడు మండలం లోని వావిల్లపాలెం గ్రామంలో నాయకులు వాకాటి గంగాధర్ రెడ్డి ప్రసూన కుమార్తె వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పెన్ పవర్
## రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి జిల్లా। చిత్తూరు జిల్లా। వై.ఎస్.ఆర్. కడప జిల్లా।

## తిరుపతి పక్షుల వైవిధ్యానికి నిలువుటద్దం 'గరుడ అట్లాస్'..

తిరుపతి: ఫిబ్రవరి 22, పెన్ పవర్
ఆధ్యాత్మిక నగరం తిరుపతి మరియు దాని పరిసర ప్రాంతాల్లోని పక్షుల జీవవైవిధ్యాన్ని శాస్త్రీయంగా నమోదు చేసే లక్ష్యంతో చేపట్టిన గరుడ అట్లాస్, గతంలో తిరుపతి బర్డ్ అట్లాస్, ఐదవ ఎడిషన్ విజయవంతంగా ముగిసింది. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ తిరుపతి నేచర్ సొసైటీ మరియు ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ సంయుక్తంగా ఈ భారీ ప్రాజెక్టును నిర్వహిస్తున్నాయి.

సాంస్కృతిక వారసత్వంగా "గరుడ" పేరు..

2022 లో తిరుపతి బర్డ్ అట్లాస్ గా ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని స్థానిక సాంస్కృతిక మరియు ఆధ్యాత్మికతకు చిహ్నమైన గరుడ పేరుతో గరుడ అట్లాస్ గా మార్చారు. స్థానిక ప్రజలను ప్రకృతి ప్రేమికులను ఈ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేయడమే దీని ప్రధాన ఉద్దేశం.

క్షేత్రస్థాయిలో శాస్త్రీయ గణన

ఈ సర్వే కోసం తిరుపతి ల్యాండ్ స్కేప్ ను అత్యంత శాస్త్రీయంగా 72 గ్రిడ్లుగా ఒక్కొక్కటి 3ఐ3 కి. మీ గా విభజించారు
ప్రతి గ్రిడ్డును తిరిగి 9 ఉపగ్రేడ్లుగా విభజించి అందులో ఒక దానిని యాదృచ్ఛికంగా ఎంపిక చేసి సర్వే నిర్వహించారు. నిపుణులైన పక్షుల పరిశీలకులు, విద్యార్థులు కలిసి నాలుగు నుంచి ఐదు మంది సభ్యులతో కూడిన బృందాలు ఈ గణనలో పాల్గొన్నారు. పక్షుల రంగులు ఆకారం మాత్రమే కాకుండా వాటి కూతల ఆధారంగా కూడా జాతులను గుర్తించడం ఈ సర్వే ప్రత్యేకత.

ఆకట్టుకున్న గణాంకాలు...

గత ఐదు ఎడిషన్ లో కలిసి ఈ ప్రాంతంలో మొత్తం 274 రకాల పక్షుల జాతులను గుర్తించారు ప్రస్తుత ఐదవ విడతలో ఇప్పటివరకు 192 జాతులను నమోదు చేయగా తుది నివేదికలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా ఉన్న పక్షి ప్రేమికులు ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనడం విశేషం

పట్టణీ కరణ ప్రభావం పై అధ్యయనం..

ఈ అట్లాస్ ద్వారా సేకరించిన డేటా తిరుపతి పర్యావరణ భవిష్యత్తుకు ఎంతో కీలకం నగర విస్తరణ పెరుగుతున్న భవనాలు రోడ్లు వల్ల పక్షుల ఆవాసాలు ఎలా మారుతున్నాయో అవగాహన కలుగుతుంది. భవిష్యత్తులో నగరాన్ని అభివృద్ధి చేసేటప్పుడు పక్షుల ఉనికిని దెబ్బతీయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడానికి ఈ డేటా ఉపయోగపడుతుంది. జనాభా పోకడలు ఏటా పక్షుల




సంఖ్య పెరుగుతుందా లేదా తగ్గుతుందా అనే అంశాలను విశ్లేషించవచ్చు. జనాభా పోకడలు ఏటా పక్షుల సంఖ్య పెరుగుతుందా లేదా తగ్గుతుందా అనే అంశాలను విశ్లేషించవచ్చు.

సమన్వయం మరియు నిర్వహణ..

ఐ.ఐ.ఎస్.ఈ.ఆర్ తిరుపతిలోని డాక్టర్ రాబిన్ ల్యాబ్ ఈ ప్రాజెక్టుకు సాంకేతిక నేతృత్వం వహించింది. హరీష్ ఎస్ పుష్యమిత్ర పి రామచంద్రారెడ్డి ఈ గణన కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటం లో ఈ కరుడ అట్లాస్ ఒక మైలురాయిగా నిలుస్తుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు

## ప్రమాదవశాత్తు కౌండిన్య నదిలో పడి యువకుడు మృతి



పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 22,
సైకిల్ లో వస్తూ ప్రమాదవశాత్తు కౌండిన్య నదిలో పడి యువకుడు మృతి చెందాడు.గంగవరం మండలంలోని గుండుగల్లు గ్రామానికి చెందిన లేట్ మోహన్ ఆచారి తనయుడు సాయికిరణ్ (25) ఆదివారం గ్రామంలో నుండీ సైకిల్ తొక్కుకొంటూ సమీపంలోని దుకాణం వద్దకు వెళుతున్న క్రమంలో దారి మధ్యలోని సిమెంట్ దిమ్మెను ఢీకొని ప్రమాద వశాత్తు ప్రక్కనే నీటితో నిండిన కౌండిన్య నదిలో పడిపోయాడు.ఈ క్రమంలో నీటిలోతు ఎక్కువగా ఉండి పైకి రాలేని పరిస్థితి నెలకొంది.యువకుడు సాయికిరణ్ ఆచూకీ కోసం అతని కుటుంబ సభ్యులు ఎక్కడెక్కడో వాకబు చేసి చివరకు నదిలో పడిన సైకిల్ కనిపించింది.దీంతో నదిలో పడ్డాడని తెలుసుకున్న గ్రామస్తులు నీటి అడుగు భాగంలో కూరుకొని ఉన్న మృతదేహాన్ని ఈతగాళ్ళ సహాయంతో బయటకు తీశారు. అనంతరం యువకుడు మృతి చెందిన సమాచారాన్ని గంగవరం పోలీసులకు తెలిపి,శవాన్ని పోస్టుమార్టం కోసం పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.కాగా మృతి చెందిన యువకుడు సాయికిరణ్ తండ్రి ఇటీవల మృతి చెందగా,అతనికి ఒక తమ్ముడు మరియు చెల్లెలు ఉన్నట్లు తెలుస్తోంది.కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న సాయికిరణ్ మృతితో కుటుంభ సభ్యులు దిక్కుతోచన స్థితిలోకి వెళ్లిపోయారు.కాగా యువకుడి మృతికి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి

## శివాజీ శోభాయాత్ర విజయానికి మురుగన్ కృషి మరువలేనిది



పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 22,
పట్టణంలో ఇటీవల జరిగిన శివాజీ మహరాజ్ శోభాయాత్ర అత్యంత విజయవంతం కావడానికి పట్టణంలో ని గంటాఊరు గంగమ్మ దేవస్థానం చైర్మన్ మురుగన్ కృషి మరువలేనిదని పట్టణ భారతీయ జనతా పార్టీ, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్,ఆర్ ఎస్ ఎస్ తదితర హిందూ సంఘాల ప్రతినిధులు ఆయనను కొనియాడారు. ఈసందర్భంగా గంటాఊరు లోని ఆయన కార్యాలయంలో సంఘాల ప్రతినిధులు ఆయనకు దుశ్శాలువ కప్పి,పచ్చటి మొక్కను బహుకరించి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.ఇందులో శరవణ కుమార్, మురుగన్,ఉమాపతి,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజలు అరోగ్యకరమైన జీవనశైలితో జీవించాలి




పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 22,
ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలితో జీవించాలని మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి కోరారు.పట్టణ ప్రాంతాలలో పౌరుల శ్రేయస్సు, ఆరోగ్యకరమైన జీవనశైలి మరియు ప్రజాస్థలాల సానుకూల వినియోగాన్ని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అన్నీ పట్టణ స్థానిక సంస్థలలో హ్యాపీ సండే నైబర్ హుడ్ ఎంగేజ్మెంట్ మూవ్మెంట్ అనే కార్యక్రమాన్ని ప్రతినెల 2వ మరియు 4వ ఆదివారము రోజున నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.ఈ సందర్భముగా పలమనేరు పురపాలక సంఘ కార్యాలయ ప్రాంగణము లోని బాపూజీ ఉద్యానవనం లో హ్యాపీ సండే కార్యక్రమాన్ని మునిసిపల్ కమీషనర్ ఆధ్వర్యములో నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలి దృష్ట్యా ప్రతిఒక్కరూ శారీరక శ్రమ,యోగా మరియు ఒత్తిడిని తగ్గించుటకై ప్రభుత్వము నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు.కావున ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా యోగా,ధ్యానం,జిమ్ తదితర వాటిని అలవరచుకోవాలని అన్నారు.తదుపరి విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి నాగమణి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీపురం సీతారామయ్యచే విద్యార్థులకు నోటుపుస్తకాలు మరియు పెన్నులు తదితర విద్యా సామగ్రిని అందించారు.ఇందులో మునిసిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, మెప్మా సిఎంఎం బాబా,పురపాలక సంఘ సిబ్బంది,మెప్మా ఆర్పీలు,యోగ మాస్టర్ నందగోపాల్,బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పలమనేరు పట్టణ పరిరక్షణ సమితి సభ్యులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## శ్రీకాళహస్తికి చాగంటి రాక భక్తులకు ఎమ్మెల్యే బొజ్జల పిలుపు



శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ఫిబ్రవరి ,22 :
శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి ప్రముఖ ఆధ్యాత్మిక వక్త చాగంటి కోటేశ్వరరావు ఈ నెల 23వ తేదీ సాయంత్రం 6 గంటలకు విచ్చేయనున్న సందర్భంగా పట్టణంలో భక్తి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చాగంటి వారి ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులకు ఆత్మశాంతి, ధార్మిక చైతన్యం, సనాతన సంప్రదాయాలపై అవగాహన కలిగిస్తాయని తెలిపారు. వారి ఉపన్యాసాలు సమాజంలో నైతిక విలువలు, సద్భావన, భారతీయ సంస్కృతిపై గౌరవాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.శ్రీకాళహస్తి వంటి పవిత్ర క్షేత్రానికి ఇలాంటి మహానుభావులు విచ్చేయడం పట్టణానికి గౌరవప్రదమైన సందర్భమని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. భక్తులందరూ కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు

## రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో బ్రాంజ్ మెడల్ సాధించిన షేక్ అమర్‌కు ఘన సన్మానం

### - బహుమతులు అందజేస్తున్న నున్న సంతోష్ కుమార్



ఆత్మకూరు పెన్ పవర్ ఫిబ్రవరి 22.
చిత్తూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి అమేచ్యూర్ రెజ్లింగ్ పోటీలలో అండర్-15 గ్రికో రోమన్ విభాగం 68 కేజీల బరువు కేటగిరీలో షేక్ అమర్ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడు. ఈ విజయంతో ఆయన స్వగ్రామంమరియు పాఠశాలకు గౌరవం తీసుకొచ్చాడు.బట్టేపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పిడీగా ఉన్న కావాటి వెంకటకృష్ణయ్య శిక్షణలో సాధన చేస్తున్న షేక్ అమర్ కృషి, పట్టుదలతో ఈ విజయాన్ని అందుకున్నాడు. కోచ్ అందించిన మార్గదర్శకత్వం, క్రమశిక్షణతో కూడిన శిక్షణ ఈ విజయానికి దోహదపడినట్లు బంధుమిత్రులు తెలిపారు.ఈ సందర్భంగా ఆత్మకూరు పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నున్న సంతోష్ కుమార్, కోచ్ కావాటి వెంకటకృష్ణయ్యను పిడి, షేక్ అమర్ ను శాలువాలతో సత్కరించి, బహుమతులు అందజేశారు. భవిష్యత్తులో షేక్ అమర్‌కు ఎటువంటి సహాయం అవసరమైనా ముందుండి అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో షేక్ అమర్ తల్లిదండ్రులు, బంధుమిత్రులు మరియు స్థానికులు పాల్గొన్నారు. తమ కుమారుడు రాష్ట్రస్థాయిలో మెడల్ సాధించడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకపోయాయి. షేక్ అమర్ భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని అందరూ ఆకాంక్షించారు.


## 53 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

### రూ. 43.20 లక్షల ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి



కావలి ఆర్ సి ఇంచార్జి పెన్ పవర్ ఫిబ్రవరి 22
కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం 53 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.43,20,856 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పంపిణీ చేశారు. వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపశమనంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 21 నెలల్లో కావలి నియోజకవర్గంలో 1018 మందికి మొత్తం రూ. 8,21,26,116 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ అందజేశామని తెలిపారు. సీఎం సహాయ నిధి పంపిణీలో కావలి నియోజకవర్గం రాష్ట్రంలోనే మూడవ స్థానంలో నిలవడం గర్వకారణమని అన్నారు.వైద్య సహాయం విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని, పేదలకు అత్యవసర సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. సీఎం ఆశీస్సులతో కావలి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తిరుపతి అడవుల్లో పక్షుల సందడి.. 274 జాతులు గుర్తింపు..



తిరుపతి: ఫిబ్రవరి 22, పెన్ పవర్
తిరుపతి పరిసర ప్రాంతాల్లోని పర్యావరణ వైవిధ్యాన్ని చాటి చెబుతూ ఇటీవల నిర్వహించిన పక్షుల సర్వేలో ఆసక్తికర అంశాలు తెలుగు చూశాయి. గరుడ అట్లాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్వేలో మొత్తం 274 పక్షి జాతులను గుర్తించగా 55 వేలకు పైగా పక్షుల కదలికలను నమోదు చేశారు. ముఖ్యంగా నల్లమల్ల అడవుల్లో మాత్రమే కనిపించే ఇండియన్ ఎల్లో పక్షిని మొదటిసారిగా తిరుపతి దివ్యరామం ప్రాంతంలో గుర్తించడం విశేషం. అలాగే వేగంగా వేటాడే షాహిన్ ఫాల్కన్ తిరుమల ఘాట్ రోడ్డుపై విన్యాసాలు చేస్తూ కనిపించింది. వీటితోపాటు అరుదైన ఎన్నో త్రో టైడ్ బుల్బుల్, బ్లాక్ ఈగల్ వంటి పక్షులు ఈ ప్రాంత పర్యావరణ ఆరోగ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు



## ఘనంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి వేడుకలు



కావలి ఆర్ సి ఇంచార్జి పెన్ పవర్ ఫిబ్రవరి 22
ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 179వ వర్ధంతి వేడుకలను ాూ= నెల్లూరు జిల్లా =జణూ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించబడింది.ఆదివారం =జణూ నెల్లూరు జిల్లా కమిటీ అధ్యక్షుడు డా. సోము శ్రీనివాసులు రెడ్డి గారి ఆధ్వర్యంలో కావలి పట్టణంలోని గొట్టిపాటి కళ్యాణమండపం లో జరిగింది.ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా చేసిన వీరోచిత పోరాటాలు, ఆయన దేశభక్తి, త్యాగస్ఫూర్తి గురించి నాయకులు స్మరించుకున్నారు. భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఆయన చేసిన తొలి సాహసోపేత ఉద్యమం తరతరాలకు స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త మాలకొండారెడ్డి,
=జణూ జిల్లా మహిళా అధ్యక్షురాలు రజనీ రెడ్డి, జిల్లా సలహాదారు బొద్దు మాధవ రెడ్డి, కావలి టౌన్ అధ్యక్షుడు కలికి గిరీష్ రెడ్డి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సోము అనితా రెడ్డి, కావలి టౌన్ మహిళా ఉపాధ్యక్షురాలు శివప్రియ రెడ్డి,
మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నాయకులకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇటువంటి చారిత్రాత్మక కార్యక్రమాలు నిర్వహించి యువతలో దేశభక్తిని పెంపొందించాలని పేర్కొన్నారు


## ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యామండలి ఐపిఈ2026 పరీక్షలకు విద్యార్థులకు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శుభాకాంక్షలు



శ్రీకాళహస్తి, పెన్ పవర్, ఫిబ్రవరి ,22:
ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు (ఐపిఈ)2026 రాయబోతున్న విద్యార్థులందరికీ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, ఏకాగ్రతతో పరీక్షలు రాయాలని సూచించారు. కష్టపడి చదివిన ప్రతిఫలం తప్పకుండా మంచి ఫలితాల రూపంలో దక్కుతుందని అన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని, తల్లిదండ్రులు కూడా పిల్లలకు ధైర్యం చెప్పి ప్రోత్సహించాలని కోరారు.భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు ఈ పరీక్షలు ఒక ముఖ్యమైన మెట్టు అని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి విజయపథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

## బలిజుల ఐకమత్యానికి నాంది శ్రీకాళహస్తిలో భవన నిర్మాణానికి శంకుస్థాపన

శ్రీకాళహస్తి, పెన్ పవర్, ఫిబ్రవరి, 22 :
తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలో బలిజ కాపు భవనం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా బలిజ కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఐకమత్యాన్ని చాటుకున్నారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బలిజ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
మరో ఐదు నెలల్లో భవనం నిర్మాణం పూర్తవుతుందని నాయకులు తెలిపారు. ఎంతోకాలంగా ఉన్న బలిజ భవనం కల ఈరోజుతో సాకారమైందని ఆనందం వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బలిజ కమ్యూనిటీ పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ ఇప్పటివరకు భవనం నిర్మాణం జరగకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇకపై అందరూ ఒక్కతాటిపైకి వచ్చి భవనం నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.
ఇప్పటికే విజయవాడ, గుంటూరు, శ్రీశైలం ప్రాంతాల్లో బలిజ కమ్యూనిటీ భవనాలు ఉండి, అక్కడ సోదరులకు వసతి, భోజన



సదుపాయాలు కల్పిస్తున్నాయని తెలిపారు. అలాంటి సదుపాయాలు మన ప్రాంతంలో కూడా ఉండాలని అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో కోలా ఆనంద్, అంజూరు తారక శ్రీనివాస్, శెట్టిపల్లి సురేష్, ముత్యాల పార్థసారథి, కొట్టే సాయి ప్రసాద్, స్వర్ణ మూర్తి, ఉప్పు కిష్టయ్య, పూల కృష్ణమూర్తి, దేవస్థానం పాలక మండలి సభ్యులు దండి రాఘవయ్య, గరికపాటి చంద్ర, వెంకటేష్ దుమ్ము రాయల్, నరేంద్ర, కండ్రిగ ఉమా, గాజుల సత్యం, కంఠ రమేష్, కాసరం రమేష్, పగడాల రాజు, మొగరాల



గణేష్, వజ్రం కిషోర్, షణ్ముగం, ప్రభాకర్, పగడాల ప్రతాప్, చిలకా గోపి, హరీష్ రాయల్, వేణుగోపాల్, తుకారం, నాని, కంఠ ఉదయ్ కుమార్, జాజాల ముని, మున్నా రాయల్ తదితర నియోజకవర్గ బలిజ నాయకులు పాల్గొన్నారు.దబలిజ కమ్యూనిటీ పెద్దలు హాజరైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, ఐకమత్యంతో భవనం నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు.

# పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లాస్థాయి ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తాం

## - సోలార్ వాటర్ హీటింగ్ సిస్టమ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అమర్ మరియు ఎంపీ దగ్గుమళ్ల

పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 22,
పట్టణ ఏరియా ఆసుపత్రిని జిల్లాస్థాయి ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి మరియు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు సంయుక్తంగా ప్రకటించారు.స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఆదివారం 6వేల లీటర్ల కెపాసిటీతో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటింగ్ సిస్టంను కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి లోని వార్డులను పరిశీలించి రోగులకు అక్కడ అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సౌకర్యాలు బాగున్నాయని వైద్యులు,సిబ్బంది సైతం సేవలు బాగా అందిస్తున్నారని పలువురు కితాబిచ్చారు. తదనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పలమనేరు ఏరియా ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ అప్ గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఇక్కడకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రోగులకు అవసరమైన చాలా సౌకర్యాలను కల్పించడం జరిగిందని, త్వరలో లిఫ్ట్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం ప్రారంభించిన 6వేల లీటర్ల వాటర్ హీటింగ్ సిస్టంతో రోజుకు సుమారు 3వందల మంది రోగులు వేడి నీళ్లను వినియోగించు కోవచ్చని తెలిపారు. అయితే సౌకర్యాలతో పాటు పనిచేసే వైద్యులు మరియు సిబ్బంది మంచి సేవలు అందించినప్పుడే ఆసుపత్రికి మంచి పేరు వస్తుందని,ఆ దిశగా పనిచేసి అందరి మన్ననలు పొందాలని ఎంపీ సూచించారు. తదనంతరం మెరుగైన సేవలు అందించిన వైద్యసిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ పద్మాంజలి,ఆస్పత్రి సూపరింటెండేంట్ మమతారాణి, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి,వైద్యులు సుబ్రహ్మణ్యం, యుగంధర్ లతో పాటు బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వి బాలాజీ,ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు, సుధాకర్,టీడీపీ నాయకులు కుట్టి, ఖాజా,క్రిష్ణమూర్తి, మదన్,కిరణ్,పర్వీన్, మాభాష,లోకేష్, శ్రీనివాసులు, వెంకటరమణ తదితరులు ఉన్నారు.




# ఘనంగా హ్యాపీ సండే కార్యక్రమం

గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,22:
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు గూడూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని టిడ్కో గృహ సముదాయంలో "హ్యాపీ సండే" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. "ఆనందం సండడి సంతోషం ఆరోగ్యం" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.
వారం పొడవునా వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఒత్తిడితో పనిచేస్తూ అలసిపోయే ప్రజలు ఆదివారం రోజున కుటుంబ సభ్యులు, మిత్రులు, స్నేహితులతో కలిసి ఆనందంగా గడపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. శారీరక, మానసిక ఉల్లాసం పెంపొందించేందుకు పాటలు, నృత్యాలు, మ్యూజికల్ చైర్స్, స్పూన్ అండ్ లెమన్ వంటి వినోదాత్మక పోటీలను నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో మునిసిపల్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ మురళి, సానిటరీ మేస్త్రీలు జానకిరామయ్య , సానిటరీ ఇన్స్పెక్టర్ దీనరాజు, వెంకటయ్య పాల్గొన్నారు. అలాగే రమాదేవి నాయుడు హాజరై కార్యక్రమాన్ని అభినందించారు. టిడ్కో సిబ్బంది రమణయ్య, సతీష్ తో పాటు పెద్ద సంఖ్యలో టిడ్కో లబ్ధిదారులు వయస్సుతో సంబంధం లేకుండా వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విస్తృత స్థాయి సమావేశం

### కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

కావలి ఆర్సి ఇంచార్జ్ పెన్ పవర్ ఫిబ్రవరి 22
కావలి పట్టణంలోని ఆర్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ శాసనసభ్యులు, కావలి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించడం, రాబోయే కార్యక్రమాలపై కార్యాచరణ రూపకల్పన చేయడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు నుండి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి, ఎవష సభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నెల్లూరు జిల్లా పార్లమెంట్ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి, కావలి నియోజకవర్గం పరిశీలకులు ధనుంజయ రెడ్డి తదితర ముఖ్య నాయకులు పాల్గొని పార్టీ భవిష్యత్ దిశపై మార్గనిర్దేశం చేయనున్నారని తెలిపారు.
కావలి నియోజకవర్గంలో పార్టీ శక్తిని మరింతగా ప్రజలకు చాటిచెప్పే వేదికగా ఈ విస్తృత స్థాయి సమావేశం నిలుస్తుందని రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొన్న నేపథ్యంలో రేపటి సమావేశం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకోనుందని తెలిపారు





# బేడన్ పావెల్ జయంతి ఘనంగా మొక్కలు నాటి సేవా స్ఫూర్తి చాటిన స్కౌట్స్ & గైడ్స్



శ్రీకాళహస్తి పెన్ పవర్ ఫిబ్రవరి, 22 :
శ్రీకాళహస్తి: ప్రపంచ స్కౌట్స్ ఉద్యమ వ్యవస్థాపకుడు రాబర్ట్ బేడన్ పావెల్ జన్మదినోత్సవాన్ని శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కాసా గార్డెన్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
ముందుగా జిల్లా కార్యాలయ కమిషనర్ టి. రమేష్ బాబు బేడన్ పావెల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బేడన్ పావెల్ చూపిన సేవా మార్గాన్ని ప్రతి స్కౌట్, గైడ్ ఆదర్శంగా తీసుకోవాలని, క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవా భావాలను అలవరచుకోవాలని సూచించారు. విద్యార్థులు సమాజాభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. "సేవే మా ధ్యేయం" అనే నినాదంతో స్కౌట్స్, గైడ్స్ సేవా స్ఫూర్తిని చాటారు.కార్యక్రమంలో జిల్లా శిక్షణాధికారిణి సావిత్రి, యూత్ చైర్మన్ ఎస్.కె. అజారుద్దీన్, గైడ్ కెప్టెన్ కుసుమకుమారి, స్కౌట్ మాస్టర్లు విద్యాసాగర్, వెంకటేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



# ఈ-వే బిల్లుతో వ్యాపారస్తులకు తీవ్ర ఇబ్బందులు

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 22.
ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దృష్టికి తెచ్చిన నెల్లూరు బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులురాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టాలని చూస్తున్న ఈ వే బిల్లు వల్ల బంగారు వ్యాపారస్తులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని నెల్లూరు బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దృష్టికి తెచ్చారు. ఈ మేరకు ఆదివారం నెల్లూరులోని విపిఆర్ నివాసంలో కలిసి ఈ వే బిల్లు అంశంపై వినతి పత్రం అందజేశారు. ఈ వే బిల్లు ప్రవేశపెడితే ప్రాక్టికల్ గా పలు సమస్యలు వస్తాయని చెప్పారు. అధిక-విలువైన సరుకుల తరలింపులో భద్రతా సమస్యలు వస్తాయని చెప్పారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలో ఈ-వే బిల్ పోర్టల్‌లో సున్నితమైన సరుకు వివరాలను బహిర్గతం చేయడం వలన అధిక-విలువైన వస్తువులు దోపిడీకి గురయ్యే వీలుందన్నారు. ఇది ప్రాణాలకు మరియు వాణిజ్యానికి ప్రమాదం కలిగిస్తుందని చెప్పారు. ఈ రంగం ఎక్కువగా చిన్న, అసంఘటిత మరియు తరచుగా చదువురాని ఉద్యోగ కార్మికులపై ఆధారపడి ఉంటుందనీ, వారు తరచుగా వస్తువుల తరలింపు కోసం ఇ-వే బిల్లులను రూపొందించడంలో గణనీయమైన ఇబ్బందులను ఎదుర్కొంటారన్నారు. బహుళ-మోడల్ రవాణా మార్గాల ద్వారా (రోడ్డు, రైలు, స్థానిక రవాణా) వస్తువుల రవాణా జరుగుతున్న నేపథ్యంలో సాంకేతిక మౌలిక సదుపాయాలు లేని సాంప్రదాయ క్యారియర్‌లకు ఇ-వే బిల్లు యొక్క నిజ-సమయ నవీకరణ అసాధ్యమన్నారు. కాబట్టి ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ వే బిల్లు అమలు ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎంపీ నీ కలిసిన వారిలో నెల్లూరు బులియన్ అండ్ డైమండ్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు శాంతి లాల్ జైన్, కార్యదర్శి శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ సత్యం, ఆంజనేయులు, ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు



# విలేజి హెల్త్ క్లినిక్ భూమి పూజ

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 22.
పెనబల్లి గ్రామం లో ఆదివారం రోజు విలేజ్ హెల్త్ క్లినిక్ భూమి పూజ చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో సర్పంచ్ ఓడ పెంచలయ్య తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు ఉప్పల మహేంద్రా జొన్నవాడ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ నెంబర్ కిలుకుప్ప శ్రీనివాసులు యాదవ్ కుమ్మ సుధాకర్ బుచ్చి మున్సిపాలిటీ కౌన్సిలర్ దాచూరి సత్యం టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు




# ఎమ్మెల్యే ముందు గోడు వెల్లబోసుకున్న చీటీల వ్యాపారి వెంకట్రావ్ బాధితులు

పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 22,
నియోజకవర్గ శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని ఆదివారం సాయంత్రం చీటిల పేరిట నమ్మి మోసపోయిన వెంకట్రావ్ బాధితులు కలసి తమ గోడును వెల్లబోసుకున్నారు. పట్టణానికి చెందిన బంగారు మరియు ఫైనాన్స్ వ్యాపారి వెంకట్రావ్ సుమారు 14కోట్లకు పైగా ఐపి దాకలు చేసి పరారైన విషయం తెలిసిందే. దీంతో గత రెండు రోజులుగా పలమనేరు పరిసర ప్రాంతాలకు చెందిన వందల మంది బాధితులు ఆవేదనకు గురవుతూ అతని ఆచూకి కోసం వెతుకుతున్నారు. అయితే అసెంబ్లీ సమావేశాలకు హాజరై స్థానిక ఎమ్మెల్యే అందుబాటులో ఉన్నారని తెలుసుకున్న బాధితులు ఆదివారం ఆయన కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. దీనిపై బాధితుల వివరాలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి జరిగిన సంఘటనపై పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకుని పరారీలో ఉన్న వెంకట్రావ్ ను గుర్తించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన డీఎస్పీ ప్రభాకర్ ను ఆదేశించారు.అయితే ఏదో విధంగా తమను ఆదుకోవాలని బాధితులు కన్నీటి పర్యంతం కాగా చట్టానికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అంతవరకు సమయమనం పాటించాలని బాధితులకు ఆయన సూచించారు. బాధితుల వెంట టిడిపి సీనియర్ నాయకులు బ్రహ్మయ్య తదితరులున్నారు



# పార్టీ కార్యాలయ భూమి పూజ, వ్యాపార ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్

గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,22:
తిరుపతిలో జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ,యువదళపతి నారా లోకేష్ ఆదేశాల మేరకు పార్లమెంట్ నూతన పార్టీ కార్యాలయం ఏర్పాటు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అవిలాల గ్రామంలో జరుగుతున్న పార్టీ కార్యాలయ భూమి పూజ కార్యక్రమంలో జోనల్ కో ఆర్డినేటర్, పార్లమెంట్ అధ్యక్షురాలు ఆధ్వర్యంలో స్థానిక శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యాలయ నిర్మాణం విజయవంతంగా పూర్తవాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.
అదేవిధంగా గూడూరు పట్టణంలోని షిరిడీ సాయి నగర్‌లో వేముల సునీల్ నూతనంగా ఏర్పాటు చేసిన వీఎస్ కూల్ బజార్ వ్యాపార సంస్థను ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ప్రారంభించారు. వ్యాపారం అభివృద్ధి చెందాలని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక యువత వ్యాపార రంగంలో ముందుకు రావాలని ప్రోత్సహించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





# బీసీ సింహగర్జనకు చెరుకుమూడి నేతలు

గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,22:
విజయవాడగుంటూరు హైవే పై నిర్వహించనున్న బీసీల పార్టీ "బీసీ సింహగర్జన" సభకు ఆదివారం మనుబోలు మండలం చెరుకుమూడి గ్రామం నుండి నాయకులు, కార్యకర్తలు భారీగా బయలుదేరారు. జిల్లా కో-కన్వీనర్ బొద్దు రమేష్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది రెండు బస్సుల్లో సభకు వెళ్లడం విశేషంగా నిలిచింది.
ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, భారతీయ యువజన పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న బీసీల సింహగర్జన సభను విజయవంతం చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న రెండు ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీసీల పార్టీ ఎదగడం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి బీసీ నాయకుడు ఆలోచించి పార్టీ కండువా కప్పుకోవాలని సూచించారు."బీసీల ఐక్యత ఆత్మగౌరవం జిందాబాద్" అంటూ నినాదాలు చేస్తూ నాయకులు ఉత్సాహంగా బయలుదేరారు. రాష్ట్ర ప్రజలు ఒక్కసారి ఆలోచించి బీసీల పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువత, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఖాజా నగర్ 7.వ వార్డ్ చెత్త తొలగించుడం

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 22.
బుచ్చిరెడ్డిపాళెం పట్టణం లో ఖాజా నగర్ లో 7,ఉన్న ఉర్దూ పాఠశాల, మసీదుల వద్ద అపరిశుభ్రంగా ఉన్నాయి. దీంతో స్థానిక టిడిపి నాయకులు సమస్యను చైర్ పర్సన్ సుప్రజా.మురళి నగర కమిషనర్ బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు నాయకులు దగ్గరుండి చెత్తా తొలగించి మసీదు వద్ద శానిటేషన్ పనులు చేశారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో టౌన్ ఆర్గనైజర్ సెక్రెటరీ శుభహాని అల్తాఫ్ హనీష్. పాల్గొన్నారు



# విశ్వ మానవ అధికార పరిషత్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్

శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,ఫిబ్రవరి ,22 :
తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల మండలి ఆధ్వర్యంలో కొత్త బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులు షేక్ మస్తాన్ సాహెబ్ చేతుల మీదుగా షేక్ కరిష్మాను తిరుపతి జిల్లా వైస్ ప్రెసిడెంట్ (ఉమెన్ సెల్)గా, షేక్ ఇష్రాబాన్‌ను తిరుపతి జిల్లా సెక్రటరీ (ఉమెన్ సెల్)గా నియమించారు.ఈ సందర్భంగా వారు బాధ్యతలు స్వీకరిస్తూ, సంస్థను మరింత బలోపేతం చేస్తూ మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ అవకాశం కల్పించిన ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులు షేక్ మస్తాన్ సాహెబ్‌కు మరియు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఆర్. అన్సారి కి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సభ్యులు పాల్గొని కొత్త బాధ్యులకు అభినందనలు తెలిపారు.




# శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో శాస్త్రోక్తంగా మహా కుంభాభిషేక మహోత్సవం

శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,ఫిబ్రవరి ,22 :
శ్రీకాళహస్తి: పట్టణంలోని చెన్నై రోడ్డులో వెలసిన శిరిడి సాయిబాబా ఆలయంలో మహా కుంభాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాస శుద్ధ పంచమి తిథికి అనుగుణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య అశ్విని నక్షత్రయుక్త వృషభ లగ్నంలో ఈ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది.ఈ మహా కుంభాభిషేక కార్యక్రమాన్ని శ్రీ చండికా పీఠం వ్యవస్థాపకులు శ్రీ సింగరాజు ప్రకాశం శాస్త్రి గారు, శ్రీ సింగరాజు బాలసుబ్రహ్మణ్యం శాస్త్రి గారి ఆధ్వర్యంలో నిర్వహించారు. గత మూడు రోజులుగా యాగశాల ఏర్పాటుతో వివిధ పూజలు, హోమాలు, ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా కొనసాగాయి.మహోత్సవ దినాన పరివార దేవతల అష్టబంధనం, దీక్షా హోమం, ప్రతిష్ఠా హోమం, శాంతి హోమం, పౌష్టిక హోమం, నాడీ సందానం, తత్వార్చన, తత్వ హోమం, స్పర్శాహుతి, మహా పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠ, మహా నైవేద్యం వంటి శాస్త్రోక్త కార్యక్రమాలు నిర్వహించి అనంతరం మహా కుంభాభిషేకం నిర్వహించారు. కుంభాభిషేకం అనంతరం కర్పూర నీరాజనం సమర్పించి, స్వామివారికి పంచ హారతులు అందజేశారు.అశేష భక్తజనం భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని కుంభాభిషేక మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించారు. శ్రీ షిరిడి సాయిబాబా మందిర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది



# రాష్ట్రానికే ఆదర్శంగా నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీ.

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 22.

నెల్లూరు రూరల్ లో తిరుగులేని శక్తిగా తెలుగుదేశం పార్టీ. నెల్లూరు రూరల్ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చేస్తున్నాం. 31వ డివిజన్ అక్కచెరువుపాడుకు చెందిన 200 కుటుంబాలు చేరిక. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిన 31వ డివిజన్ అక్కచెరువుపాడుకు చెందిన షేక్ మున్వర్, గులామ్, పమీద, ఇస్మాయిల్, ఉదయ్. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. పదిమందికి మేలు చేసేవిధంగా, ప్రజలకు ఉపయోగపడేవిధంగా పని చేయండి. అందుకు స్థానిక శాసనసభ్యుడిగా నా సహకారం ఎప్పుడూ ఉంటుంది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కూటమిని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. రాష్ట్రం మొత్తం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.అందరం కలసికట్టుగా ఒక్కతాటిపై ఉండి, ప్రజలకు అందుబాటులో ఉందాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.నన్ను నమ్మి తెలుగుదేశం పార్టీలో చేరుతున్న ప్రతిఒక్కరికి అండగా ఉంటా. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంఛార్జ్ మన్నేపల్లి రఘు, కో క్లస్టర్ ఇంఛార్జ్ పల్నాటి మస్తాన్ నాయుడు, 31వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూకటి హరి బాబు యాదవ్, టీడీపీ నాయకులు ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో సత్తా చాటిన బట్టేపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినీలు ఘన సన్మానం

ఆత్మకూరు పెన్ పవర్ ఫిబ్రవరి 22.

బహుమతులు అందజేసిన బిజెపి పట్టణ అధ్యక్షుడు నున్న సంతోష్ కుమార్ టిడిపి ఎంపీటీసీ శశిధర్ రెడ్డి హెడ్మాస్టర్ డి. భార్గవి, ఉపాధ్యాయులు బట్టేపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థినీలు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచి పాఠశాలకు గర్వకారణమయ్యారు. అండర్-17, అండర్-15 విభాగాల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించిన విద్యార్థినీలను మరియు వారికి శిక్షణనందించిన పీడీ కావాటి వెంకటకృష్ణయ్యను పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలో మెరిసిన విద్యార్థినీలు9వ తరగతి విద్యార్థిని సి.హెచ్. రాణి అండర్-17 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి పాఠశాల కీర్తిని రాష్ట్రవ్యాప్తంగా చాటింది. అలాగే 8వ తరగతి విద్యార్థినీలు వి. పల్లవి, యు. అలేఖ్య అండర్-15 విభాగంలో కాంస్య పతకాలు సాధించి ప్రతిభ కనబర్చారు. ఈ విజయాలకు క్రీడా ఉపాధ్యాయుడు పీడీ వెంకటకృష్ణయ్య అందించిన కఠిన శిక్షణే కారణమని ఉపాధ్యాయులు తెలిపారు.అతిథులకు విద్యార్థుల ఘన స్వాగతం సన్మాన కార్యక్రమానికి టిడిపి ఎంపీటీసీ తూమాటి శశిధర్ రెడ్డి, ఆత్మకూరు పట్టణ బిజెపి అధ్యక్షులు నున్న సంతోష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు పూలు చల్లి అతిథులను వేదికపైకి ఆహ్వానించి ఘన స్వాగతం పలికారు. విజేతలకు బహుమతులు అందజేసి శాలువాలతో సత్కరించారు. హెడ్మాస్టర్ ప్రశంసలు హెడ్మాస్టర్ డి. భార్గవి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల నుండి రాష్ట్రస్థాయిలో విజయం సాధించడం ఎంతో గర్వకారణమని అన్నారు. అలాగే పిడి వెంకట కృష్ణయ్య ఏ పాఠశాలలో ఉంటే ఆ స్కూల్ రాష్ట్ర స్థాయిలో ఉంటుందని అన్నారు పాఠశాల క్రీడా విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థినీలు ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ప్రజాప్రతినిధుల హామీలుటిడిపి ఎంపీటీసీ తూమాటి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.బిజెపి పట్టణ అధ్యక్షులు నున్న సంతోష్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారే జీవితంలో గొప్ప స్థానాలు అధిరోహించగలరని అన్నారు. గురువుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని కొనియాడారు. భవిష్యత్తులో అవసరమైన సహాయాన్ని అందిస్తానని ప్రకటించారు విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పిడికి శాలువాలతో ఘన సన్మానం చేసి బహుమతులు అందజేసిన నున్న సంతోష్ కుమార్ ఘనంగా ముగిసిన కార్యక్రమం కార్యక్రమం ముగింపులో అతిథులను హెడ్మాస్టర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.
రాష్ట్రస్థాయిలో క్రీడల్లో సత్తా చాటిన బట్టేపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినీల విజయంతో గ్రామంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.



# ప్రభుత్వం బాలికల వసతి గృహంలో డిడి శోభారాణి తనిఖీ

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 22.

బుచ్చిరెడ్డిపాలెం రామకృష్ణ నగర్ ప్రాంతంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని డిడి శోభారాణి సందర్శించారు. ఈ తనిఖీలో భాగంగా వసతి గృహంలోని సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం నాణ్యత, తాగునీటి వసతి, మరియు పరిశుభ్రత గురించి ఆరా తీశారు. వసతి గృహంలోని రిజిస్టర్లను తనిఖీ చేసి హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ బాలికల వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. వసతి గృహంలో భద్రతా ఏర్పాట్లు మరియు విద్యార్థుల విద్యా ప్రమాణాల గురించి ఆరా తీశారు. నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. బాలికల రక్షణ మరియు సంక్షేమం తమ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బుచ్చిరెడ్డిపాలెం పరిధిలోని హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలో స్థానిక అధికారులు మరియు హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు. వసతి గృహాల్లో భోజనం మెనూ ప్రకారం అందుతుందా లేదా అన్న విషయాన్ని విద్యార్థుల ద్వారానే తెలుసుకున్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని వంట సిబ్బందికి సూచనలు చేశారు. బాలికల హాస్టల్ కావడంతో భద్రత విషయంలో కఠినంగా ఉండాలని ఆదేశించారు. రామకృష్ణ నగర్ వద్ద ఉన్న ఈ వసతి గృహం విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని అందించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వసతి గృహాల నిర్వహణ జరగాలని, లోపాలు ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.





# తూనికల కొలతల శాఖ తనిఖీలు 15 మందిపై కేసులు





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 22.

బుచ్చిరెడ్డిపాలెంలో సంచలనం రేపిన మాంసం షాపుల దాడుల పూర్తి వివరాలు ఈ వీడియోలో ఉన్నాయి. బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న చికెన్ మరియు మటన్ షాపులపై తూనికల మరియు కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. దాదాపు 15 షాపుల యజమానులు వినియోగదారులను తూకంలో మోసం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలలో మార్పులు చేయడం లేదా తప్పుడు రాళ్లు ఉపయోగించడం ద్వారా ప్రజల నుంచి ఎక్కువ డబ్బులు వసూలు చేస్తూ తక్కువ మాంసం ఇస్తున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో 15 మంది యజమానులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు ప్రకటించారు. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న తూకపు యంత్రాలను సీజ్ చేశారు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, తూకంలో ఏవైనా అనుమానాలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.
ప్రతి రోజూ వందలాది మంది వినియోగదారులు మాంసం కొనుగోలు చేస్తుంటారు. అయితే వ్యాపారులు చేసే చిన్న చిన్న తూకపు మోసాల వల్ల సామాన్యులు భారీగా నష్టపోతున్నారు. ఈ విషయాన్ని గమనించిన తూనికల కొలతల శాఖ అధికారులు బుచ్చిరెడ్డిపాలెం వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని షాపుల జాబితా తయారు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. అధికారులు సీజ్ చేసిన యంత్రాలను పరిశీలించగా వాటిలో సాంకేతిక లోపాలు సృష్టించి తూకం తక్కువ వచ్చేలా చేసినట్లు నిర్ధారణ అయింది. ఇలాంటి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ప్రజలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ప్రతి షాపులో తూకపు యంత్రం ముద్రను పరిశీలించాలని కోరారు. బుచ్చిరెడ్డిపాలెం పరిసర ప్రాంతాల్లో ఇలాంటి దాడులు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు

# ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి కుటుంబ సభ్యులకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పరామర్శ

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 22.

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,వేదగిరి నరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆదివారం పొట్టేపాలెంలోని శ్రీనివాసులు రెడ్డి ఇంటికి వెళ్లిన ఎంపీ.. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి గారితో కలిసి ఇందుపూరు అత్యుచ్ రెడ్డి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. శ్రీనివాసులు రెడ్డి మృతి తీరని లోటని, అలాంటి వ్యక్తిని కోల్పోవటం వ్యక్తిగతంగా బాధాకరమన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శ్రీనివాసులు రెడ్డి చేసిన శ్రమ ఎనలేనిదని అన్నారు. ఎప్పుడు ఎలాంటి అవసరం ఉన్నా.. తాము అండగా ఉంటామని చెప్పారు. శ్రీనివాసులు రెడ్డి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో మేయర్ రూప్ కుమార్ యాదవ్, టిడిపి నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్ రెడ్డి, దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, గుడి హరి రెడ్డి, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు



# దామర్ గిద్ధ హనుమాన్ మందిర్ ప్రాంగణంలో ధ్యానయోగ కార్యక్రమం,ప్రవచనం

పెన్ పవర్ ఫిబ్రవరి 22. నాగల్ గిద్ధ ఓం శ్రీ గురు బసవ లింగాయనమ:
నాగల్ గిద్ధ మండల పరిధిలోని శేరి దామర్ గిద్ధ గ్రామ హనుమాన్ మందిర్ ప్రాంగణంలో ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించబడును.ఈ ఆధ్యాత్మికమైన ప్రవచనం పరమ పూజ్య నిరంజన్ స్వామి హిరేమట్ సంస్థాన్ బాల్కి నోటి నుండి అద్భుతమైన ప్రవచనం చెప్పబడును.తేది 22 - 02 - 2026 నుంచి 05- 03 -2026 వరకుఉదయం:ధ్యానయోగా కార్యక్రమం జరుపబడునుసమయం ఉదయం : 5:30 నిమిషాల నుండి 6 :30 నిమిషాల వరకు ధ్యానయోగా కార్యక్రమం జరుపబడును. సాయంత్రం ప్రవచనం కలదు సాయంత్రం 7 గంటల నుంచి 8 గంటల వరకు ప్రవచన కార్యక్రమం కలదు.వచ్చిన భక్తులకు, వీక్షించిన ప్రజానీకానికి అన్నప్రసాదం కలదు కావున చుట్టూ ప్రక్కల గ్రామాల నుండి భక్తులు తరలివచ్చి ఈ కార్యక్రమం జయప్రదం చేయగలరని శేరి దామర్ గిద్ధ గ్రామ భక్తులవిన్నపం.సంప్రదించవలసి ఫోన్ నంబర్ 9959178706,,8374613762




# వికృత మాల గ్రామపంచాయతీలో డ్రైనేజీ సమస్యలపై గ్రామస్తుల గోడు

శ్రీకాళహస్తి రూరల్ ,పెన్ పవర్ ,ఫిబ్రవరి, 22 :

వికృత మాల గ్రామపంచాయతీ పరిధిలో గత రెండు మూడు నెలలుగా డ్రైనేజీ కాలువలు శుభ్రపరచకపోవడంతో దుర్వాసన వ్యాపించి, పురుగులు పెరిగి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో మురుగు నీరు పేరుకుపోవడంతో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్తుల ప్రకారం పంచాయతీ కార్యాలయంలో సమస్యను పలుమార్లు తెలియజేసినప్పటికీ సరైన స్పందన లభించలేదని తెలిపారు. పంచాయతీ సెక్రటరీ వారానికి ఒకరోజు మాత్రమే పన్నులు సేకరించేందుకు వస్తున్నారని, మిగతా రోజుల్లో అందుబాటులో ఉండరని వారు ఆరోపిస్తున్నారు.ఈ నేపథ్యంలో మండల అధికారులకు గ్రామస్తులు తమ గోడును వెళ్లబోసుకుంటూ, వెంటనే స్పందించి పేరుకుపోయిన డ్రైనేజీ కాలువలను శుభ్రపరచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.





# ఒకే రోజు 26 మందికి పదోన్నతి

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 22.

సమర్ధంవతంగా పని చేస్తూ జిల్లాను ప్రగతి పథంలో నిలపాలని కలెక్టర హిమాన్షు శుక్లా అన్నారు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న 26 మందికి వివిధ హోదాలలో పదోన్నతులు కల్పిస్తూ ప్రొసీడింగ్స్ ను కలెక్టర్ అందించారు సీనియర్ అసిస్టెంట్ నుంచి ఆర్ఐలు గా ఎనిమిది మంది. గ్రేడ్-1 గ్రామ రెవెన్యూ అధికారులు నుంచి సీనియర్ అసిస్టెంట్ హోదాకు 18 మందికి ఉత్తరాలు ఇచ్చారు



# బెజవాడ జగదీష్ కుటుంబాన్ని పరామర్శించిన వేమిరెడ్డి దంపతులు



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 22.

బుచ్చిరెడ్డి పాలెం రూరల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బెజవాడ జగదీష్ మాతృమూర్తి బుచ్చిరెడ్డి పాలెం మాజీ ఎంపీపీ మంజులమ్మ మరణించడం పట్ల నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తమ సంతాపం వ్యక్తం చేశారు. దామరమడుగు గ్రామంలోని జగదీష్ నివాసానికి వెళ్ళి జగదీష్ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జగదీష్ మాతృమూర్తి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తల్లిని కోల్పోవడం పూడ్చలేని లోటని ఈ క్లిష్ట సమయంలో జగదీష్ కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆకాంక్షించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న జగదీష్ కుటుంబంలో ఇటువంటి విషాదం చోటుచేసుకోవడం బాధాకరమని జగదీష్ కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు గారు తెలిపారు. బెజవాడ జగదీష్ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో టిడిపి సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి , మోర్ల మురళి, కె.వి శేషయ్య మరియు స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు అండగా కౌన్సిలర్ నౌషాద్ బేగం

ఆత్మకూరు పెన్ పవర్ ఫిబ్రవరి 22.

ఏడవ వార్డు కౌన్సిలర్ నౌషాద్ బేగం ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ నౌషాద్ బేగం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తాను ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏడవ వార్డు వైసిపి నాయకులు సయ్యద్ జమీర్ భాష, మునీర్ భాష, హెచ్ఎం ఫయాజ్ ఫయాజుద్దీన్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# హ్యాపీ సండే కార్యక్రమం

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 22.

బుచ్చిరెడ్డిపాలెం పురపాలక సంఘం పరిధిలో నిర్వహించబడుతున్న హ్యాపీ సండే కార్యక్రమాని ఫిబ్రవరి 22వ తేదీ ఆదివారం బెజవాడ గోపాల రెడ్డి పార్కు నందు ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. మోర్ల సుప్రజ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమం స్థానిక ప్రజలకు ఎంతో ఆహ్లాదాన్ని ఉత్సాహాన్ని ఇస్తుంది. బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ పరిధిలోని నివాసితులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. ముఖ్యంగా యువత, పిల్లలు వృద్ధులకు అవసరమైన వినోద కార్యక్రమాలు ఇక్కడ ఏర్పాటు చేయబడ్డాయి. ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించడ సామాజిక ఐక్యతను చాటడం ఈ హ్యాపీ సండే ప్రధాన ఉద్దేశ్యం. బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ కమీషనర్ నేతృత్వంలో ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరడమైనది








# ఎరుకల సంఘం ఆధ్వర్యంలో సన్మానం

పెన్ పవర్ జహీరాబాద్
జహీరాబాద్ నియోజకవర్గం తెలంగాణ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో శనివారం పచ్చ తోరణం హోటల్లో మున్సిపాలిటీ ఎలక్షన్లో కౌన్సిలర్ గా గెలుపొందిన కౌన్సిలర్లు అయిన కోహీర్ మున్సిపాలిటీ చైర్మన్ అశోక్ కు ఎరుకల కులస్తుల కౌన్సిలర్లు జాజుల శ్రీకాంత్, సదాశివపేట్ నర్సింలు ఎరుకల కుల సంఘాల నాయకులు, కుల పెద్దలు, బంధుమిత్రులు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కోహీర్ మండల మున్సిపాలిటీ చైర్మన్ అశోక్ హాజరై ఎరుకల కులస్తులకు అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీ ఇవ్వడం జరిగింది..కోహీర్ మండల మున్సిపాలిటీ 3 వార్డు కౌన్సిలర్ జాజుల శ్రీకాంత్, సదాశివపేట్ మండల మున్సిపాలిటీ 2 వార్డు కౌన్సిలర్ నర్సింలు మాట్లాడుతూ... ఎరుకల కులస్తులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, ఎరుకల కులస్తులకు ఎలాంటి సమస్యనైనా తీర్చడంలో ముందుంటామని చెప్పడం జరిగింది.ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సంఘ నాయకులు కెంపుల రాజు, మాజీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నిమ్మల కిష్టయ్య మాట్లాడుతూ,.... ప్రతి ఎరుకల కులస్తుడు రాజకీయంగా, వ్యాపార, ఉద్యోగ పరంగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని కోరడం జరిగింది. ఈ సమావేశానికి జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలో ఉన్న మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కుల పెద్దలు, నాయకులు ,కులస్తులు,బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని సన్మాన కార్యక్రమం విజయవంతం చేయడం జరిగింది

# గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలి

## - జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



పెన్ పవర్ సంగారెడ్డి, ఫిబ్రవరి 21)
పల్లెల సర్వతో ముఖాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా సర్పంచులు అంకిత భావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పిలుపునిచ్చారు.నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో నిర్వహించిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిక్షణలో పొందిన అవగాహనను గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శక పాలన అందించడం సర్పంచుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ, అన్ని వర్గాల సమన్వయంతో గ్రామాల సమగ్రాభివృద్ధి సాధించాలని సూచించారు.ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి స్పందించాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో మమేకమై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు.గ్రామ పంచాయతీలను ఆదర్శవంతమైన స్థానిక సంస్థలుగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మరియు ఇన్చార్జ్ జిల్లా పంచాయతీ అధికారి జానకి రెడ్డి, డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు మరియు ఆయా గ్రామాలసర్పంచులు పాల్గొన్నారు.

# యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం

## -జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



పెన్ పవర్ సంగారెడ్డి, ఫిబ్రవరి 22)
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఫిబ్రవరి 23వ తేదీ (సోమవారం) నుండి యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# తెలంగాణలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు శిక్షణ



పెన్ పవర్ జహీరాబాద్
తెలంగాణలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు శిక్షణ లో భాగంగా వివిధ మండలాల్లోని నూతన సర్పంచులకు ఫిబ్రవరి 17 నుంచి 21 వరకు సంగారెడ్డి దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం కార్యాలయంలో 5 రోజుల పాటు గ్రామ పాలన, పంచాయతీ రాజ్ 2018 చట్టం పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు ఉండగా, జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి, న్యాల్కల్ జహీరాబాద్ సర్పంచులు అందరూ హాజరు అయ్యారు... అంతేకాకుండా పంచాయతీ పాలనలోని వ్యవస్థలు, గ్రామ పంచాయతీల అధికారాలు, సర్పంచుల విధులు వంటి 24 అంశాలపై అవగాహన కల్పిస్తూ, ఒక్కో సర్పంచు ఐదు రోజులు పాటు శిక్షణ పొంది , ఐదు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న వారికిసర్టిఫికెట్ లు అందజేశారు. సర్పంచుల శిక్షణ ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తో మరియు జిల్లా పంచాయతీ అధికారితో ఝూరసంగం మండల వివిధ గ్రామ సర్పంచులు.సర్టిఫికెట్ లు అందుకున్నారు.

**తెలంగాణలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు శిక్షణ కార్యక్రమం**

**తెలంగాణలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు శిక్షణ :**

లో భాగంగా వివిధ మండలాల్లోని నూతన సర్పంచులకు ఫిబ్రవరి 17 నుంచి 21 వరకు సంగారెడ్డి దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం కార్యాలయంలో 5 రోజుల పాటు గ్రామ పాలన, పంచాయతీ రాజ్ 2018 చట్టం పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు ఉండగా, జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి, న్యాల్కల్ జహీరాబాద్ సర్పంచులు అందరూ హాజరు అయ్యారు... అంతేకాకుండా పంచాయతీ పాలనలోని వ్యవస్థలు, గ్రామ పంచాయతీల అధికారాలు, సర్పంచుల విధులు వంటి 24 అంశాలపై అవగాహన కల్పిస్తూ, ఒక్కో సర్పంచు ఐదు రోజులు పాటు శిక్షణ పొంది , ఐదు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న వారికిసర్టిఫికెట్ లు అందజేశారు. సర్పంచుల శిక్షణ ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తో మరియు జిల్లా పంచాయతీ అధికారితో ఝూరసంగం మండల వివిధ గ్రామ సర్పంచులు.సర్టిఫికెట్ లు అందుకున్నారు.

# దాత్తాత్రేయ షష్ఠమ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత

పెన్ పవర్ సదాశివ పేట)
సదాశివపేట పట్టణంలోని శ్రీ మాణిక్ ప్రభు ఆలయ ప్రాంగణంలో నెలకొల్పబడిన శ్రీ గురుదత్తాత్రేయ స్వామి వారి షష్ఠమ వార్షికోత్సవానికి 12 వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత ముఖ్య అతిథులుగా విచ్చేసి దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. తదుపరి ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో వారిని ఘనంగా సన్మానించారు. ఇట్టి కార్యక్రమం బల్లెం భారతమ్మ లక్ష్మయ్య గారి నేతృత్వంలో ఆలయ కమిటీ పర్యవేక్షణలో నిర్వహించారు. ఉదయం 6.00 గంటలకు స్వామి వారికి మేల్కొలుపు, అభిషేకము, ప్రత్యేక పుష్పాలంకరణ నిర్వహించారు. తదుపరి గీతామందిర్ బృందం వారిచే భగవద్గీత పారాయణము, భజన కార్యక్రమము నిర్వహించారు. తదుపరి ఆలయకమిటి వారి ఆధ్వర్యంలో భక్తులందరికి అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో భగవద్గీత బృందం సభ్యులు శిరీష, శీలవతి, శమంత, స్రవంతి, కవిత, శశికళ, మాధవి, జగదీశ్వర్, ఆలయ కమిటీ సభ్యులు చిదానందం, గాజుల కృష్ణ, లక్ష్మయ్య, విజయ్ కుమార్, ఈశ్వరయ్య, మరియు పి. ఎం. ఆర్ యువసేన నాయకులు రామన్న, అనిల్, అఖిల్, అంజి గౌడ్, సోమ శంకర్ పాల్గొన్నారు.

# నేటి నుండీ న్యాల్కల్ లో శక్తిగల సువార్త పండగలు ప్రారంభం

పెన్ పవర్ న్యాల్కల్
న్యాల్ కల్ మండల కేంద్రంలో ఫిబ్రవరి 22,23 తేదీలలో అనగా ఆదివారం మరియు సోమవారం సాయంత్రం 6 గంటలకు జరిగే న్యాల్కల్ క్రైస్తవ సహోదరులు శక్తిగల సువార్త పండగలు గణంగా జరుగబోతున్నాయని నిర్వాహకులు పాస్టర్ యం అనిల్ కుమార్ తెలియచేశారు ఈ సువార్త పండగలకు ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా నుండి సల్మాన్ రాజ్, గెరాల్డ్ జెర్రీ లు దైవసందేశాన్ని అందిస్తారు. న్యాల్కల్ గ్రామ ప్రజలు అందరు ప్రేమతో ఆహ్వానిస్తున్నాను కావున మండలం తో పాటు నియోజకవర్గం లో నుండి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి అని పిలుపునిచ్చారు.






# నూతన ఫ్యాక్టరీని ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



పెన్ పవర్ జోగిపేట)
ఆందోల్ మండలం పోసానిపేట గ్రామ శివారులో ఆర్ ఆర్ డి లిక్కర్ పరిశ్రమను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించి ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో మహిళలకు మంచి శుభవార్త అని రానున్న రోజుల్లో ఆందోల్ మండల వ్యాప్తంగా 10విల ఎకరాల అసైన్మెంట్ ల్యాండ్ ఉంది మరిన్ని పరిశ్రమలు వస్తాయని పరిశ్రమలో మహిళలు పనిచేస్తున్న పనిని పరిశీలించారు మంత్రి దామోదర్ రాజన్న సినిమా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నైపుణ్యం గల మహిళలు యువకులకు ఉపాధి కల్పన లక్ష్యంగా పనిచేస్తామని మంత్రి దామోదర్ వెల్లడించారు ఆందోల్ ప్రాంతంలో మహిళల తో పాటు యువత ఉపాధికి ఇండస్ట్రీలు ఎంతో గాను తోడ్పడుతూగా నిలుస్తాయని ఉద్యోగ ఉపాధి కల్పించే ఫ్యాక్టరీస్ కావాలనే మా తపన రాజకీయాలకు అతీతంగా అని పేర్కొన్నారు నా ప్రాంతంలో ఉన్న నై నైపుణ్యం గల మహిళలకు ఉపాధి ఇస్తున్నందుకు ఆర్ ఆర్ డి లిక్కర్ యజమానికి నిపుణ రెడ్డికి అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పేర్ని నాని మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి ఎమ్మెల్సీ భాను ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి నూతనంగా ఎన్నుకోబడ్డ ఆందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ చిట్టిబాబు పోసానిపేట గ్రామ సర్పంచ్ గంటా శ్రీనివాస్ మాజీ మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య కౌన్సిలర్ పట్లల్ల ప్రవీణ్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు

# గ్రీన్ కార్డ్ కోసం 19 నెలల నిరీక్షణ: అమెరికా వలస వ్యవస్థలోని 'అనిశ్చితి'కి నిలువుటద్దం

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా కలని నిజం చేసుకునే క్రమంలో గ్రీన్ కార్డ్ అనేది ఒక కీలక మైలురాయి. అయితే ఆ మైలురాయిని చేరుకోవడానికి కొందరికి పట్టే సమయం వర్ణనాతీతం. ఇటీవల ఒక వలసదారుడు రెడ్డిట్ వేదికగా పంచుకున్న తన 19 నెలల సుదీర్ఘ నిరీక్షణ కథనం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ఇది కేవలం ఒక వ్యక్తి ఆవేదన మాత్రమే కాదు.. వేలాది మంది వలసదారులు ఎదుర్కొంటున్న వ్యవస్థాగత జాప్యానికి నిదర్శనం.

**ఒక దరఖాస్తు.. రెండేళ్ల నిరీక్షణ**

సదరు అభ్యర్థి సెప్టెంబర్ 2024లో కుటుంబ ఆధారిత వలస కోసం ఐ-130 , ఐ-485 దరఖాస్తులను సమర్పించారు. ఫిబ్రవరి 2025లో ఐ-130 ఆమోదం పొందినప్పటికీ అసలైన ఐ-485 మాత్రం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. సాధారణంగా ఐ-130 ఆమోదం పొందాక ప్రక్రియ వేగవంతం కావాలి.. కానీ ఇక్కడ 19 నెలలు గడిచినా ఫలితం లేకపోవడం గమనార్హం.

**పాక్షిక ఊరట.. కానీ పూర్తి భరోసా లేదు..**

ప్రస్తుతానికి సదరు అభ్యర్థికి వర్క్ ఆథరైజేషన్ (ఈఏడీ) , అడ్వాన్స్ పరోల్ (ట్రావెల్ పర్మిట్) లభించాయి. ఇంటర్వ్యూ లేకుండానే ఇవి ఆమోదం పొందడం సానుకూలాంశమే అయినా అవి తాత్కాలిక ఉపశమనాలు మాత్రమే. ఇప్పటికీ సదరు అభ్యర్థి ఎఫ్-1 స్టూడెంట్ వీసా స్టేటస్‌లోనే కొనసాగుతున్నారు. గ్రీన్ కార్డ్




చేతికి వచ్చే వరకు కెరీర్ , వ్యక్తిగత జీవితంలో ఎటువంటి ధీమా ఉండదు. ఏ క్షణంలో ఏ మార్పు వస్తుందో అన్న భయం వలసదారులను వేధిస్తోంది.

**జాప్యానికి కారణాలు ఏమిటి?**

వలస నిపుణుల విశ్లేషణ ప్రకారం.. ఈ జాప్యానికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. యూఎస్.సీఐఎస్ కి చెందిన కొన్ని ఫీల్డ్ ఆఫీసులు వేగంగా పని చేస్తాయి. మరికొన్ని ఆఫీసుల్లో దరఖాస్తుల భారం ఎక్కువగా ఉండటం వల్ల ఏళ్ల తరబడి సమయం పడుతుంది. అభ్యర్థి స్థానిక కాంగ్రెస్ ప్రతినిధి ద్వారా విచారణ జరిపించినా యూఎస్.సీఐఎస్ నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడం.. వ్యవస్థలో ఉన్న పారదర్శకత లోపాన్ని సూచిస్తోంది.

**బాధితులకు ఉన్న మార్గాలేమిటి?**

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నవారు చట్టపరమైన నిపుణుల సలహా మేరకు నడుచుకోవాలి. మొదటి ఇంక్వైరీ జరిగి చాలా కాలం అయినందున, మరోసారి ప్రజా ప్రతినిధుల ద్వారా ఒత్తిడి తీసుకురావడం ముఖ్యం. ప్రభుత్వం తన విధిని సక్రమంగా నిర్వహించనప్పుడు కోర్టు ద్వారా ఆదేశాలు జారీ చేయించడం. ఇది యూఎస్.సీఐఎస్ ని నిర్ణయం తీసుకునేలా నిర్బంధిస్తుంది. ఇమ్మిగ్రేషన్ న్యాయవాదుల సలహాతో కేసులో సాంకేతిక లోపాలు ఏవైనా ఉన్నాయేమో సరిచూసుకోవడం అవసరం.ఒక దేశ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములవుతూ చట్టబద్ధంగా దరఖాస్తు చేసుకున్న వలసదారులు ఇలాంటి అనిశ్చితిని ఎదుర్కోవడం దురదృష్టకరం. 19 నెలల నిరీక్షణ అనేది కేవలం సమయానికి సంబంధించింది కాదు.. అది ఒక వ్యక్తి భవిష్యత్తు , మానసిక ప్రశాంతతకు సంబంధించింది. ఇప్పటికైనా యూఎస్.సీఐఎస్ తన ప్రాసెసింగ్ సమయాన్ని మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# బొగ్గుల శ్రీనివాస్ మృతి మిస్టరీ ఛేదించిన పోలీసులు.. అసలు కారణం ఇదే..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఖమ్మం జిల్లా, పాలేరు జలాశయంలోకి ఈనెల 14న కారు దూసుకెళ్లిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అదొక సామాన్య రోడ్డు ప్రమాదమని అంతా భావించిన తరుణంలో, మత్స్యకారులు గుర్తించిన చిన్న చిన్న ఆధారాలు ఒక భయంకరమైన హత్యోదంతాన్ని బయటపెట్టాయి. కారు వెనుక సీటులో విగతజీవిగా ఉన్న రచయిత, యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ మృతదేహం కేవలం ఒక ప్రమాద బాధితుడిది కాదు.. అది నమ్మిన స్నేహితుడే వెన్నుపోటు పొడిచిన కుట్రకు సాక్ష్యం. ఖమ్మం గ్రామీణ ఏసీపీ తిరుపతిరెడ్డి వెల్లడించిన వివరాలు, సమాజంలో ఆర్థిక లావాదేవీలు ప్రాణాల కంటే విలువైనవిగా మారుతున్న తీరును ఎత్తిచూపుతున్నాయి.

**ఆర్థిక విభేదాలే..**

బొగ్గుల శ్రీనివాస్, అతని స్నేహితుడు వేణు మాధవరెడ్డి మధ్య ఉన్న ఆర్థికపరమైన విభేదాలే ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసులు నిర్ధారించారు. అప్పుల గొడవలు లేదంటే వ్యాపార లావాదేవీల వల్ల తలెత్తిన మనస్పర్థలు చివరికి ఒకరి ప్రాణాలను తీసే స్థాయికి చేరుకున్నాయి. 'ధనం మూలం ఇదం జగత్' అన్న సూక్తి నేడు 'ధనం మూలం ఇదం హత్య' అన్నట్లుగా మారిపోయింది. తను ఆర్థికంగా ఎదిగేందుకు అడ్డుగా ఉన్నాడనే నెపంతో, ఏళ్ల తరబడి ఉన్న స్నేహాన్ని కాలరాసి, కిరాయి హంతకులను ఆశ్రయించడం వేణు మాధవరెడ్డిలోని నేర ప్రవృత్తికి నిదర్శనం.

**పథకం ప్రకారం..**

హత్యను సహజ మరణంగా లేదా ప్రమాదంగా చిత్రీకరించేందుకు నిందితులు పకడ్బందీగా కుట్ర పన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులతో (పోకల కోటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హఫీజ్, ఎండీ అజ్మత్ అలీ ఖాన్) ఒప్పందం కుదుర్చుకున్న వేణు, విజయవాడ వెళ్తున్నామని నమ్మించి శ్రీనివాస్‌ను కారులో ఎక్కించుకున్నాడు. నార్కెట్‌పల్లి సమీపంలో పథకం ప్రకారం శ్రీనివాస్‌ను హత్య చేసి, అనంతరం ఆ మృతదేహాన్ని నేరం బయటపడకుండా పాలేరు జలాశయంలోకి కారుతో సహా తోసేయడం సినిమా కథను తలపిస్తోంది. దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు చేసిన ప్రయత్నం, నేరగాళ్లు ఎంతటి తెలివితేటలను ఉపయోగిస్తున్నారో చెబుతోంది.

**మత్స్యకారుల అప్రమత్తత**

ఈ కేసులో మత్స్యకారుల పాత్ర అత్యంత కీలకంగా మారింది. కారు నీటిలోకి దూసుకెళ్లిన సమయంలో ఒక వ్యక్తి బయటకు దూకి తప్పించుకోవడం వారు గమనించడం వల్లే పోలీసులకు అనుమానం కలిగింది. శ్రీనివాస్ సోదరుడు అబ్బులయ్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు లోతుగా విచారణ జరిపారు. కూసుమంచి సీఐ, ఎస్ఐ బృందం తక్కువ సమయంలోనే కాల్ డేటా, స్థానిక సాక్ష్యాల ఆధారంగా నిందితులను పట్టుకోవడం అభినందనీయం. కారు ప్రమాదంగా మూసివేయాల్సిన ఫైలును, హత్య కేసుగా మార్చి నిజాలను వెలికితీయడం పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచుతోంది.

**మానవ సంబంధాల పతనం**

ఒకప్పుడు స్నేహం అంటే ప్రాణమిచ్చే బంధం. కానీ నేడు అదే స్నేహితుడు ప్రాణాలు తీసే యమధర్మరాజుగా మారుతున్నాడు. డబ్బు కోసం సొంత మనుషులను, స్నేహితులను చంపేందుకు వెనుకాడడం లేదంటే సమాజంలో నైతిక విలువలు ఎంత పతనమవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. యూ ట్యూబర్‌గా, రచయితగా సమాజానికి తన గళం వినిపించిన శ్రీనివాస్ ఇలా అంతం కావడం సాహిత్య, డిజిటల్ రంగాలకు తీరని లోటు. ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత లేకపోవడం, మితిమీరిన ఆశలు ఇలాంటి అనర్థాలకు దారితీస్తున్నాయి. శ్రీనివాస్ హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసినప్పటికీ, వారికి చట్టం ద్వారా అత్యంత కఠినమైన శిక్షలు పడేలా చూడాలి. అప్పుడే ఇలాంటి నేరాలకు పాల్పడాలనుకునే వారికి భయం కలుగుతుంది. ఆర్థిక గొడవలను చర్చల ద్వారా లేదా చట్టపరంగా పరిష్కరించుకోవాలి తప్ప, ప్రాణాలు తీయడం పరిష్కారం కాదు. సమాజంలో పెరుగుతున్న ఈ నేర సంస్కృతిని అరికట్టడానికి పోలీసు నిఘాతో పాటు, వ్యక్తిగత నైతికత కూడా అవసరం. బొగ్గుల శ్రీనివాస్ ఆత్మకు శాంతి కలగాలని, నిందితులకు తగిన శాస్తి జరగాలని కోరుకుందాం.

# కూర విషయంలో గొడవ.. తల్లిని చంపిన కొడుకు.. దారుణ ఘటన..

**హైదరాబాద్ పెన్ పవర్:** అమ్మ.. ఈ రెండక్షరాల పదంలోనే ప్రపంచమంత ప్రేమ దాగి ఉంటుంది. ఏ చిన్న కష్టం వచ్చినా ఆ గుండెను అక్కున చేర్చుకునే ఆత్మీయత తల్లిది. కానీ, కళ్ల ముందే తిరుగుతున్న కొడుకును చూసి మురిసిపోయిన ఆ తల్లి, తను ప్రేమతో వండిన కూరే తన పాలిట మృత్యుపాశం అవుతుందని ఊహించలేకపోయింది. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా, డోంగర్గావ్ గ్రామంలో జరిగిన ఈ ఘోర కలి కాలపు వికృత చేష్టకు నిలువుటద్దం. కేవలం ఇంట్లో కాకరకాయ కూర వండినందుకే కన్నతల్లిని కడతేర్చిన ఆ కిరాతకుడి చర్య, సభ్య సమాజం తలదించుకునేలా చేస్తోంది.

**మద్యం రక్కసి.. ఛిద్రమవుతున్న సంసారాలు**

ఈ ఘోరానికి ప్రధాన కారణం మద్యం. నిందితుడు జగదీష్ పెట్కులే మద్యానికి బానిస కావడంతో ఇప్పటికే అతని సంసారం చిన్నాభిన్నంగా మారింది. తాగుడు వల్ల కలిగే వేధింపులు భరించలేక అతని భార్య అతన్ని వదిలి వెళ్లిపోయింది. భార్య వెళ్లినా, కొడుకు బాగుపడతాడని ఆశపడిన ఆ వృద్ధురాలు అతనికి తిండిపెడుతూ తనే చూసుకుంటుంది. కానీ మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన కొడుకు.. తనకు నీడనిచ్చిన తల్లిని కూడా మనిషిగా గుర్తించలేకపోయాడు. మద్యం అనేది కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాదు.. అతని చుట్టూ ఉన్న కుటుంబాలనే సర్వనాశనం చేస్తుందని ఈ ఘటన నిరూపించింది.

**విచక్షణారహిత దాడి**

ఘటన జరిగిన రాత్రి జగదీష్ మద్యం మత్తులో ఇంటికి వచ్చాడు. ఇంట్లో చేసిన కాకరకాయ కూరను చూసి ఆగ్రహానికి లోనయ్యాడు. ఒక సామాన్యమైన కూర విషయంపై తల్లితో గొడవకు దిగడం, అది హత్య వరకు దారితీయడం అత్యంత విచారకరం. సహనం కోల్పోయి తల్లిపై విచక్షణారహితంగా దాడి చేసి చంపేశాడు. ఇక్కడ సమస్య కేవలం కూర మాత్రమే కాదు, మద్యం వల్ల ఆ వ్యక్తి మెదడులో కలిగిన అస్థిరత. చిన్న చిన్న కారణాలకే ప్రాణాలు తీసే స్థాయికి మనిషి వెళ్తున్నాడంటే, సమాజంలో హింస ఎంతగా వేళ్లూనుకుందో అర్థం చేసుకోవచ్చు.

**నేర ప్రవృత్తి.. సామాజిక విశ్లేషణ**

హత్య చేసిన అనంతరం జగదీష్ గ్రామంలో తిరుగుతూ 'నేను మా అమ్మను చంపాను' అంటూ గట్టిగా కేకలు వేయడం అతనిలోని నేర ప్రవృత్తికి మత్తులో ఉన్న అపస్మారక స్థితికి నిదర్శనం. ఒక ఘోరమైన తప్పు చేశాననే పశ్చాత్తాపం కంటే, మద్యం మత్తులో ఆ విషయాన్ని ప్రకటించడం అతని వికృత మనస్తత్వాన్ని చూపిస్తోంది. గ్రామస్తులు సకాలంలో స్పందించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అరెస్ట్ చేశారు.

**మద్య నిషేధం అవసరమా?**

ఇలాంటి ఘటనలు ఏదో ఒక మారుమూల గ్రామంలో జరిగే చిన్న గొడవలు కావు. ఇవి దేశవ్యాప్తంగా ఉన్న మద్యపాన సమస్యకు సూచికలు. మద్యం ద్వారా వచ్చే ఆదాయం కంటే, దానివల్ల విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు, జరుగుతున్న నేరాల వల్ల కలిగే నష్టం దేశానికి ఎంతో ఎక్కువ. మద్యానికి బానిసలైన వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం, గ్రామ స్థాయిల్లో మద్యం విక్రయాలపై నియంత్రణ విధించడం అత్యవసరం. కేవలం ప్రభుత్వాలే కాకుండా, సమాజంలోని ప్రతి వ్యక్తి బాధ్యతగా మెలగాలి.

# పవన్ ను కదిలించిన ఊరు.. రూ.50 లక్షల విరాళం, వెరీ ఇంట్రెస్టింగ్!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను ఓ గ్రామం కదిలిచింది. రెండేళ్ల క్రితం ఆ గ్రామానికి వెళ్లిన పవన్ లో సెంటిమెంట్ ను రగిలిచింది. అప్పటి నుంచి ఆ ఊరు పవన్ సొంతూరుగా మారిపోయింది. 20 నెలల వ్యవధిలో గ్రామం రూపురేఖలు మారిపోయేలా చేసింది. పంచాయతీ రాజ్ మంత్రిగా ప్రభుత్వ నిధులతో ఆ గ్రామాభివృద్ధికి బాటలు పరిచిన పవన్.. గ్రామంపై పెంచుకున్న మమకారంతో సొంతంగా రూ.50 లక్షలు సమకూర్చారు. రాష్ట్రంలో వేలాది గ్రామాలు ఉండగా, పవన్ ఆ గ్రామంపై అంతలా ప్రేమ పెంచుకోవడానికి కారణం చాలా చిన్నదే. కానీ, అది చాలా తీవ్రమైన భావోద్వేగానికి సంబంధించినది.. ఆ సంబంధమే పవన్ ఇంటిపేరు. ఆ ఊరి పేరు ఒక్కటి కావడమే.. నిజమే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇంటి పేరు ఉండటమే నంద్యాల జిల్లాలోని 'కొణిదల' గ్రామం రూపురేఖలను మార్చివేసింది. నందికొట్కూరు మండలంలో ఉన్న ఈ గ్రామం 20 నెలల క్రితం వరకు ఎవరికీ పెద్దగా తెలియదు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో పర్యటించిన పవన్ కల్యాణ్ తన ఇంటి పేరు ఉన్న గ్రామం కోసం తెలుసుకుని ప్రేమ పెంచుకున్నారు. గ్రామాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటించారు. అధికారంలోకి రాగానే 'కొణిదల' గ్రామాన్ని ప్రత్యేక ఆసక్తితో అభివృద్ధి చేయిస్తున్నారు పవన్.పంచాయతీరాజ్ మంత్రిగా కొణిదల గ్రామానికి అనేక నిధులు విడుదల చేశారు పవన్. పల్లెపండగ 1.0, పల్లెపండగ 2.0, సాస్కీ, గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ తదితర పథకాల ద్వారా వచ్చిన నిధులతో రోడ్లు, డ్రెయిన్లు, కాలువల అభివృద్ధి చేశారు. గోకులాలు, బలహీన వర్గాల ఇళ్ల నిర్మాణ పథకం కింద గ్రామానికి భారీగానే లబ్ధి జరిగింది. సుమారు రూ. 6 కోట్లకు పైగా నిధులతో కొణిదెల గ్రామ రూపురేఖలే మార్చివేశారు పవన్. అంతేకాకుండా సొంతంగా రూ.50 లక్షలు విరాళంగా సమకూర్చి గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో పవన్ దృష్టిని కొణిదెల ఆకర్షించినట్లు చెబుతున్నారు. గత ఏడాది నందికొట్కూరు నియోజకవర్గంలో ఫారం పాండ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్లిన సందర్భంలో ఇచ్చిన మాట ప్రకారం ఆ గ్రామాభివృద్ధికి రూ. 50 లక్షల విరాళం అందజేశారు. ఈ డబ్బుతో కొణిదెల గ్రామంలో 90 వేల లీటర్ల రక్షిత తాగునీటి పథకాన్ని నిర్మించారు. ఈ ట్యాంక్ కొణిదెల గ్రామంలో 2 వేల మంది దాహార్తి తీర్చనుంది. వేసవికి ముందే ఈ ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కావడంపై పవన్ కళ్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు. సకాలంలో నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరించిన జిల్లా అధికార యంత్రాంగానికి, గ్రామీణ నీటి సరఫరా విభాగం (=ఔా) అధికారులకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

పవన్ చొరవతో కొణిదెల గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. పల్లెపండగ 1.0లో సుమారు రూ. 20 లక్షలకు పైగా నిధులు వెచ్చించి మూడు రహదారులను నిర్మించారు. పల్లెపండగ 2.0లో రూ. 45 లక్షల అంచనా వ్యయంతో ఏడు సీసీ రోడ్లు నిర్మించారు. వీటితో పాటు గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ నిధులతో కొణిదెల గ్రామంలోని జిల్లా పరిషత్ స్కూల్ నుంచి పగిడ్యాల మండల పరిధిలోని లక్ష్మాపురం వరకు 5 కిలోమీటర్ల మేర బి.టి. రోడ్డు నిర్మాణానికి రూ. 4 కోట్లు, ఆర్ అండ్ బి రోడ్డు నుంచి కొణిదెల గ్రామం వరకు ఉన్న రోడ్డు పునరుద్ధరణ పనులకు రూ. 45 లక్షలు మంజూరు చేయించారు. వీటితో పాటు ఆ గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు 4 గోకులాలు, గృహ నిర్మాణశాఖ సహకారంతో 19 ఇళ్లు, నీటితొట్టెలు నిర్మించారు. రైతుల కోసం 49 ఫీడర్ ఛానల్స్ ను జాతీయ ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి చేశారు. రెండు మైనర్ కాలువల పునరుద్ధరణ, మూడు కమ్యూనిటీ చెక్ డ్యామ్స్ మరమ్మత్తులు పూర్తి చేశారు. ఇచ్చిన హామీ మేరకు గ్రామస్తులు అడిగిన ప్రతి పని చేస్తూ కొణిదలను తన సొంతూరుగా మార్చుకున్నారు పవన్.

# మావోయిస్టు అగ్రనేత 'దేవ్ జీ' లొంగుబాటు.. 6 దశాబ్దాల సాయుధ పోరాటానికి తెర!

**హైదరాబాద్ పెన్ పవర్:** మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆరు దశాబ్దాల సాయుధ పోరాటం ముగింపు దశకు చేరిందన్న సంకేతాలను నిజం చేస్తూ ఆ పార్టీ అగ్రనేత దేవ్ జీ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆయనతోపాటు మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు రాజిరెడ్డి, మరో 16 మంది కీలక నేతలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దేవ్ జీ టార్గెట్ గా కేంద్ర బలగాలు రెండు రోజుల కిందట ఆపరేషన్ కర్రె గుట్టలు-2 చేపట్టినట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో దేవ్ జీతోపాటు మావోయిస్టు కీలక నేతలు తెలంగాణలోని అసిఫాబాద్ అడవుల్లో ఎస్ఐబి పోలీసులకు లొంగిపోయినట్లు చెబుతున్నారు. దేవ్ జీ లొంగుబాటును ఇంకా అధికారికంగా ప్రకటించాల్సివుంది.మావోయిస్టు ప్రధాన కార్యదర్శి దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి లొంగుబాటు వార్తలు దేశవ్యాప్తంగా సంచలనంగా మారాయి. మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత భారత్ ఆవిష్కరిస్తామని కేంద్రం ప్రకటించింది. మునుపెన్నడూ లేనట్లు తీవ్ర నిర్బంధం అమలు చేయడంతో మావోయిస్టు పార్టీ ఉక్కిరిబిక్కిరి అయింది. ఈ నేపథ్యంలో కీలక నేతలు ఉద్యమాన్ని వదిలి ఒక్కొక్కరుగా బయటకు వచ్చారు. మరికొందరు అగ్రనేతలు పోలీసు ఎన్ కౌంటరులో అసువులు బాశారు. కొద్ది నెలల క్రితం మావోయిస్టు కేంద్ర కమిటీ నేత మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న లొంగుబాటు సంచలనం సృష్టించింది. ఇప్పుడు ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శి దేవ్ జీ లొంగిపోవడంతో ఉద్యమాన్ని నడిపే నాథుడే కరువైనట్లు వ్యాఖ్యానిస్తున్నారు.

మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మరణం తర్వాత దేవ్ జీ పార్టీ బాధ్యతలు స్వీకరించారు. ఆపరేషన్ కగార్



కొనసాగుతుండగానే ఆయన పార్టీ బాధ్యతలు భుజానకెత్తుకున్నారు. నంబాల కేశవరావు ఎన్కౌంటర్ తర్వాత దేవ్ జీ లక్ష్యంగా బలగాలు పావులు కదిపాయి. ఈ క్రమంలోనే గత ఏడాది నవంబరులో దేవ్ జీ విజయవాడలో పోలీసులకు చిక్కినట్లు ప్రచారం జరిగింది. విజయవాడ, ఏలూరు, కాకినాడల్లో తలదాచుకున్న సుమారు 50 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో దేవ్ జీ వ్యక్తిగత భద్రతా సిబ్బంది ఉన్నట్లు అప్పట్లో పోలీసులు ప్రకటించారు.ంఅయితే అప్పట్లో దేవ్ జీ అరెస్టుపై ఎన్నో ఊహాగానాలు వినిపించాయి. కానీ దేవ్ జీ సురక్షితంగా ఉన్నట్లు మావోయిస్టులు ప్రకటించడంతో ఈ వదంతులకు ఫుల్ స్టాప్ పడ్డాయి. ఇక తాజాగా దేవ్ జీ లొంగుబాటులో ఉద్యమం చివరి దశకు చేరుకున్నట్లు భావిస్తున్నారు. దేవ్ జీతోపాటు కీలక నేత మల్లా రాజిరెడ్డితోపాటు మరో 16 మంది లొంగిపోయారన్న వార్తలతో మావోయిస్టు ఉద్యమం పరిసమాప్తమైనట్లే అంటున్నారు.

గత ఏడాది మావోయిస్టు పార్టీ బాధ్యతలు చేపట్టిన దేవ్ జీ తెలంగాణలోకి జగిత్యాల జిల్లా కోరుట్ల. 1982లో విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితులైన తిరుపతి అప్పట్లోనే నక్సల్ ఉద్యమం కోసం అడవి బాట పట్టారు. పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు.

1993-94 ప్రాంతంలో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యునిగా ఎంపికయ్యారు. మావోయిస్టు పార్టీలో నక్సలైట్లు విలీనం అయిన తర్వాత దండకారణ్యంలో మావోయిస్టు పార్టీ ఏర్పాటు చేసిన తొలి దళానికి తిరుపతి కమాండర్ గా పనిచేసినట్లు చెబుతున్నారు. తిరుపతికి దేవ్ జీతోపాటు అనేక మారుపేర్లతో పిలుస్తారు. సంజీవ్, చేతన్, సుదర్శన్, రమేష్ వంటి పేర్లతో తిరుపతి పనిచేశారు.

# ధోని రిటైర్మెంట్ ఊహాగానాలకు బ్రేక్..
# సీఎస్‌కే సీఈఓ బిగ్ అప్‌డేట్



**హైదరాబాద్ పెన్ పవర్:** గత కొంతకాలంగా మహేంద్ర సింగ్ ధోని రిటైర్మెంట్ చేస్తారనే ఊహాగానాలకు బ్రేక్ పడింది. మరోసారి అభిమానులను అలరించేందుకు సిద్ధమైతున్నట్లు తెలుస్తుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో కూడా ధోనీ ఆడబోతున్నారని చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) సీఈఓ కాశీ విశ్వనాథన్ ధృవీకరించారు. కాగా ధోనీ నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ ఐదు సార్లు ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకుంది. ఐపీఎల్ కెరీర్‌లో అతడు మొత్తం 235 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించగా, 136 విజయాలు సాధించారు. ధోని కెప్టెన్సీ విజయం శాతం 57.87గా ఉంది. ఐపీఎల్ ఆరంభం నుంచే చెన్నై సూపర్ కింగ్స్‌తో ఉన్న ధోనీ, ఫ్రాంచైజీకి ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన కెప్టెన్‌గా చరిత్ర సృష్టించారు. ఈ ఐదు ట్రోఫీలు ఐపీఎల్ చరిత్రలోనే అత్యధికం కావడం విశేషం. ఐపీఎల్ 2024 సీజన్‌కు ముందు ధోనీ కెప్టెన్సీ బాధ్యతలను రుతురాజ్ గైక్వాడ్‌కు అప్పగించినప్పటికీ, ఆటగాడిగా మాత్రం జట్టుతోనే కొనసాగుతున్నారు. ఇప్పుడు 2026 సీజన్‌లోనూ అతని అనుభవం సీఎస్‌కేకు కీలకంగా మారనుంది. అబుదాబిలో జరిగిన ఐపీఎల్ 2026 వేలంలో సీఎస్‌కే మొత్తం 9 మంది ఆటగాళ్లను కొనుగోలు చేసింది. ఐపీఎల్ 2026కు ముందు సీఎస్‌కే కీలక మార్పులు చేసింది. సంజూ శాంసన్‌ను రూ.18 కోట్ల జట్టులోకి తీసుకుంది. అదే సమయంలో రవీంద్ర జడేజా (రూ.14 కోట్లు), సామ్ కరన్ (రూ.2.4 కోట్లు) ట్రేడ్ ద్వారా రాజస్థాన్ రాయల్స్‌కు వెళ్లారు. రాహుల్ చాహర్, అకీల్ హోసైన్, మ్యాట్ హెన్రీ, మ్యాథ్యూ షార్ట్,
సర్ఫరాజ్ ఖాన్ లాంటి అనుభవజ్ఞులతో పాటు అన్‌క్యాప్డ్ ప్లేయర్లు కార్తిక్ శర్మ, ప్రశాంత్ వీర్‌లపై ఒక్కొక్కరికి రూ.14.2 కోట్లతో కొనుగోలు చేసింది. ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 26వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. పూర్తి షెడ్యూల్ ఇంకా విడుదల కాలేదు. ధోనీ మరోసారి మైదానంలోకి దిగనుండటంతో, సీఎస్‌కే అభిమానుల్లో ఉత్సాహం మరోసారి పిక్స్‌కు చేరింది.

# దక్షిణాఫ్రికాతో సూపర్-8 మ్యాచ్... టీమిండియా ముందు భారీ టార్గెట్



**హైదరాబాద్ పెన్ పవర్:**టీ20 ప్రపంచకప్ సూపర్ 8 పోరులో దక్షిణాఫ్రికా జట్టు, టీమిండియా ముందు 188 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. డేవిడ్ మిల్లర్ (63), డెవాల్డ్ బ్రెవిస్ (45), ట్రిస్టన్ స్టబ్స్ (44లి) మెరుపు ఇన్నింగ్స్‌లతో చెలరేగడంతో సఫారీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా (3/15) అద్భుత ప్రదర్శన చేసినా, ఇతర బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు.అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ధాటికి 20 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. క్వింటన్ డి కాక్ (6), కెప్టెన్ మార్‌క్రమ్ (4), ర్యాన్ రికెల్టన్ (7) విఫలమయ్యారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన డెవాల్డ్ బ్రెవిస్, డేవిడ్ మిల్లర్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 97 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి జట్టును ఆదుకున్నారు.బ్రెవిస్ ఔటైన తర్వాత మిల్లర్, స్టబ్స్ మరింత దూకుడుగా ఆడారు. ముఖ్యంగా మిల్లర్ కేవలం 35 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 63 పరుగులు చేయగా, చివర్లో స్టబ్స్ 24 బంతుల్లోనే 44 పరుగులు చేసి స్కోరును 180 దాటించాడు. భారత బౌలర్లలో బుమ్రా 4 ఓవర్లలో కేవలం 15 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, అర్ష్‌దీప్ సింగ్ 2 వికెట్లు తీశాడు. అయితే, హార్దిక్ పాండ్యా (45), వరుణ్ చక్రవర్తి (47) ధారాళంగా పరుగులు ఇవ్వడం దక్షిణాఫ్రికాకు కలిసొచ్చింది.

# పేకమేడలా కూలిపోయిన లంక లైనప్... ఇంగ్లండ్ అద్భుత విజయం



**హైదరాబాద్ పెన్ పవర్:**టీ20 ప్రపంచకప్ సూపర్-8 పోరులో ఇంగ్లండ్ జట్టు శ్రీలంకపై 51 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. పల్లెకెలె వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్దేశించిన 147 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో శ్రీలంక పూర్తిగా విఫలమైంది. ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి 16.4 ఓవర్లలో కేవలం 95 పరుగులకే కుప్పకూలింది. సొంతగడ్డపై లంకేయులకు ఇది దిగ్భ్రాంతి కలిగించే పరాజయం.147 పరుగుల సాధారణ లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభం నుంచే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్లు పతుమ్ నిస్సంక (9), కమిల్ మిషార (6) త్వరగా వెనుదిరిగారు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోవడానికి తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కుశాల్ మెండిస్ (4), పవన్ రత్నాయకే (0), దునిత్ వెల్లలాగే (10) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. కేవలం 34 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి లంక పీకల్లోతు కష్టాల్లో పడింది.కెప్టెన్ దసున్ షనక (30 పరుగులు, 24 బంతుల్లో, 1 ఫోర్, 2 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేసినా, అతనికి ఇతర బ్యాటర్ల నుంచి సహకారం కరువైంది. కమిందు మెండిస్ (13) కాసేపు నిలిచినా ఫలితం లేకపోయింది. ఇంగ్లండ్ బౌలర్ల క్రమశిక్షణాయుత బౌలింగ్‌కు లంక బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలిపోయింది. స్పిన్నర్ విల్ జాక్స్ కేవలం 22 పరుగులిచ్చి 3 వికెట్లతో లంక పతనాన్ని శాసించగా, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్ తలో రెండు వికెట్లు పడగొట్టారు.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. కెప్టెన్ జోస్ బట్లర్ (7) విఫలమయ్యాడు. అయితే, ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ (62 పరుగులు, 40 బంతుల్లో, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) అద్భుతమైన హాఫ్ సెంచరీతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, సాల్ట్ దూకుడుగా ఆడి స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. హ్యారీ బ్రూక్ (14), విల్ జాక్స్ (21) చివర్లో వేగంగా ఆడటంతో ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. శ్రీలంక బౌలర్లలో యువ స్పిన్నర్ దునిత్ వెల్లలాగే 26 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మహీశ్ తీక్షణ, దిల్షాన్ మధుశంక చెరో రెండు వికెట్లతో రాణించారు.


# మొత్తానికి ఫేవరెట్ స్టార్ తో జాన్వీకపూర్!

ఎంత పెద్ద హీరోయిన్ అయినా అభిమాన హీరో అంటూ ఒకరుంటారు. నటిగా కెరీర్ ముగిసే లోపు ఒక్క సారైనా ఆ స్టార్ సరసన నటించాలని కోరుకుంటారు. కానీ అలా అందరి హీరోయిన్ల విషయంలో జరగదు. ఎంత ట్యాలెంట్ ఉన్నా? అదృష్టం కూడా కలిసొస్తేనే ఛాన్స్ అందుకోగలరు. పవన్ కళ్యాణ్ సరసన అనుష్క నటించాలని ఎంతో కాలంగా అనుకుంటోంది. కానీ ఆ కాంబినేషన్ ఇంత వరకూ సెట్ కాలేదు. ఏ దర్శకుడు కూడా వాళ్లిద్దర్నీ కలిపే ప్రయత్నం కూడా చేయలేదు. అలాగని పవన్ ఇమేజ్ కు సరితూగని హీరోయిన్ అంటే? అదీ కాదు అనుష్కను అభిమానించే తెలుగు వారు ఎంతో మంది ఉన్నారు.మరెందుకు నటించలేదంటే కాలం కలిసి రాకనే చెప్పాలి. ఆ సంగతి పక్కన బెడితే? జాన్వీ కపూర్ అభిమాన స్టార్ ఎవరు? అంటే రణబీర్ కపూర్ అని అందిరికీ తెలుసు. మరి అతడితో జాన్వీ సినిమా చేసిందా? అంటే ఇంత వరకూ సాధ్యపడలేదు. చాలా కాలంగా రణబీర్ కపూర్ సరసన నటించాలని జాన్వీ భావిస్తోంది. ఓపెన్ గానే ఈ విషయాన్ని చాలాసార్లు చెప్పింది. కానీ బాలీవుడ్ మేకర్స్ ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా ఆమె ఆసక్తిని మోహిత్ సూరి గమనించాడో? ఏమోగానీ ఆ ఛాన్స్ తానే ఇస్తానంటూ ముందుకొచ్చాడు.



లేత-రంగు చీరలో ప్రియా భవాని శంకర్ స్టన్స్

రణబీర్ కపూర్ హీరోగా ఓ గ్యాంగ్ స్టార్ మ్యూజికల్ లవ్ స్టోరీని తెరకెక్కించడానికి రెడీ అవుతున్నారు. వాస్తవానికి మోహిత్ సూరి కూడా చాలా కాలంగా రణబీర్ తో సినిమా



చేయాలనుకుంటున్నాడు. కానీ రణబీర్ వేర్వేరు సినిమాలతో బిజీగా ఉండటంతో సాధ్యపడలేదు. ఇంతకాలానికి ఆ కాంబినేషన్ సెట్ అయింది. ఇందులో హీరోయిన్ గా ఎవర్ని తీసుకోవాలి? అనే చర్చ మోహిత్ టీమ్ లో జరగగా..ఆయన మరో ఆలోచన లేకుండా జాన్వీ కపూర్ ను ఫిక్స్ చేసారట. జాన్వీ కపూర్ ఆసక్తిని గమనించే మోహిత్ ఈ ఛాన్స్ కల్పించినట్లు వెలుగులోకి వస్తోంది.

తాను ఎవరో నటిని తీసుకోవడం కంటే? అభిమాన హీరోకి జోడీగా తననే తీసుకుంటే? కెమిస్ట్రీ కూడా వర్కౌట్ అవుతుంది. చాలా సన్నివేశాల విషయంలో రాజీ పడాల్సిన పని ఉండదు. పైగా మోహిత్ సినిమాల్లో రొమాంటిక్ సన్నివేశాల్లో ఘాడత కూడా ఎక్కువగానే ఉంటుంది. హీరోతో ఇంటిమేట్ సన్నివేశాలకు సైతం నో చెప్పడానికి ఛాన్స్ ఉండదు. సెట్స్ కు వెళ్లిన తర్వాత ఏ నటి అయినా దర్శకుల హీరోయిన్ గా పనిచేయాల్సిందే. అందుకు జాన్వీ కపూర్ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. ప్రస్తుతం అమ్మడు తెలుగులో 'పెద్ది' లో రామ్ చరణ్ కు జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ లో మాత్రం మోహిత్ సూరి ప్రాజెక్ట్ తప్ప ఇంకే సినిమాకు కమిట్ అవ్వలేదు. మోహిత్ సూరి పిలిచి ఇస్తోన్న అవకాశం కాబట్టి జాన్వీ ఆనందంతో ఉబ్బితబ్బితోంది.



ఐశ్వర్య మీనన్ యొక్క బ్రీజీ సీసైడ్ అవుట్‌ఫిట్

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965